
# శాకుంతలం

## వాసిరెడ్డి సీతాదేవి



"హలో! వసూ!"

వసుధ గిర్రున వెనక్కి తిరిగి చూసింది.

సుమతిని చూసి "హల్లో" అన్నది ఆమెతో మాట్లాడం ఇష్టంలేనట్టు.

"నువ్వా ఈ ఊళ్లోనే ఉంటున్నావా? ఈయన మా శ్రీవారు. ఇక్కడ ఇంజనీరుగా పనిచేస్తున్నారు."

"నమస్తే!"

"నమస్తే!"

పరస్పర నమస్కారాలు అయ్యాయి.

"ఈమె వసుధ. బి. ఏ. లో నా క్లాసుమేటు!" అంటూ భర్తకు పరిచయం చేసింది సుమతి వసుధను. వసుధ గాభరాగా వెనక్కి చూసింది. ఆమె భర్త చేతిలో సినిమా టికెట్లుతో అప్పుడే వచ్చి వెనక నిల్చున్నాడు.

"ఈయన మావారు. రామనాథం," ఎలాగో అనగలిగింది.

"హల్లో రామనాథం! నువ్వా? వసుధగారు నీ భార్యా!" అన్నాడు సుమతి భర్త రామారావు.

రామారావు ఏక వచన ప్రయోగం ఇద్దరు ఆడవారికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

"రామనాథం మా ఆఫీసులోనే యు. డి. సి." అంటూ తన భార్యకు పరిచయం చేశాడు.

రామనాథం ముఖం వెలా తెలా పోతున్నది. బాస్‌కు నమస్కరించాలనే విషయం కూడా తోచలేదు.

"సినిమాకు వచ్చారా?"

"అవును సర్!" సినిమా హాలు దగ్గిర సినిమాకు వచ్చారా అంటాడేం? ఫూల్! అనుకున్నాడు రామనాథం మనసులోనే

సుమతి రామనాథాన్నే చూస్తున్నది.

"మీ ఆవిడా మా ఆవిడా బి.ఏ.లో క్లాసుమేట్సుట. నీ

భార్య అంత చదువుకున్నదని ఎప్పుడూ చెప్పలేదేమోయ్ ?" అన్నాడు రామారావు.

వసుధకు కాళ్ళలో వణుకు ప్రారంభం అయింది. నుదురు మీద చెమట్లు పట్టాయి.

ఇతను వసుధ భర్తా? అతని రూపం చూస్తున్న సుమతి ఆశ్చర్యం నుంచి ఇంకా కోలుకోనేలేదు.

నల్లటి రంగు, లావుగా ఉన్న పెదవులు, క్రింద పెదవి కొంచెం కిందకు జారిఉన్నది. చిన్న చిన్న కళ్ళు. మెడ మీద లావుగా, అరకకట్టిన ఎద్దు చర్మంలాటి మందంగా ఉన్న మాంసం ముద్ద. భారీ శరీరం. వయసు వసుధ కంటే బాగా పెద్దగా కన్పిస్తున్నాడు.

వసుధకేసి చూసింది.

ఈ అందానికి.........

"మనం ఇక్కడే నిల్చుంటే పుణ్యకాలం కాస్తా గడిచి పోతుంది. పద పద!" అన్నాడు రామారావు భార్యతో.

"వసూ ఒకసారి మా ఇంటికి రావోయ్! నువ్వు ఈ ఊళ్ళో ఉన్నట్టు నాకు తెలియదు సుమా!"

వాళ్ళు వెళ్ళిపోయారు.

వసుధ భర్త ముఖంలోకి చూడలేకపోయింది.

"ఊఁ" భర్త అల్సేషన్‌లా గుర్రుమన్నాడు.

చేతిలోని టికెట్లు సర్రున చింపి దూరంగా విసిరేశాడు.

పక్కగా వెళ్తున్న రిక్షా ఎక్కాడు.

వసుధ యాంత్రికంగా రిక్షా ఎక్కి అతని పక్కనే కూర్చున్నది.

భర్త బుసలు కొడ్తున్నాడు.

వసుధకు కళ్ళు తిరుగుతున్నట్టు అన్పించసాగింది.

"నువ్వు బి.ఏ. చదివావా?"

"ప్లీజ్! ఇప్పుడేమీ అడక్కండి. ఇంటికి వెళ్ళాక మాట్లాడుకుందాం." బలవంతంగా గొంతు పెగల్చుకుని అన్నది.

రామనాథం "ఊఁ" అన్నాడు.

అల్‌సేషన్ డాగ్ పైకి దూకడానికి సిద్ధంగా ఉన్నట్టు అన్పించి నిలువునా వణికిపోయింది వసుధ.

తన భర్తకు అసలే అనుమానం. ఇంతకు ముందు ఎవర్నయినా ప్రేమించావా అని ఎన్నోసార్లు అడిగాడు. తను అందమైంది కనుక ఎవరో ప్రేమించే ఉంటారని అతని నమ్మకం. పైగా తను బి.ఏ. పాసయినట్టు చెప్పకుండా తల్లి దండ్రులు దాచారు. తను ఎన్నోసార్లు నిజం చెప్పాలని ప్రయత్నించింది. అసలే అనుమానపు మనిషి అని భయం వేసి మానేసింది.


*With Best Compliments from*

# UNI-SANKYO LIMITED

**Manufacturers of Quality Bulk Drugs**

*in Collaboration with*

**SANKYO COMPANY LIMITED, JAPAN**

*Factory :* Gaganpahad, Hyderabad-West, Andhra Pradesh

*Office :* 5-9-24/81, Shapurwadi, Hyderabad - 500 483 A. P.

రిక్షా ఇంటిముందు ఆగింది.

వసుధకు కాళ్ళలోని సత్తువంతా భూదేవి లాగేస్తున్నట్టు అన్పించసాగింది. తడబడుతూ భర్త తాళం తీస్తుంటే వెళ్ళి నిల్చుంది. అతని వెనకే లోపలకు వెళ్ళింది.

లోపలకు అడుగుపెట్టిందో లేదో జుట్టు పట్టుకొని వంచి దభీ దభీ వీపుమీద బాదాడు. కిందపడేసి కసిగా తన్నాడు.

వసుధ కిక్కురు మనలేదు.

గోడకు ఆనుకొని మౌనంగా కన్నీరు కారుస్తూ కూర్చుంది.

"నిజం చెప్పు! నువ్వు బి.ఏ. పాసయినట్టు మీ వాళ్ళు నా దగ్గర ఎందుకు దాచారు? నువ్వు కూడా ఎందుకు చెప్పలేదు? ఏదో గ్రంధం జరిగే ఉంటుంది. ఎవడో ప్రేమించానని ఉంటాడు. ఆ తర్వాత ముఖం తప్పించి ఉంటాడు."

వసుధ రెండు మోకాళ్ళకు మధ్య తల ఇరికించుకొని కూర్చుంది.

రామనాధం జుట్టు పట్టుకొని ముఖం పైకి ఎత్తాడు.

"చెప్పు! నిజం చెప్తావా? చంపెయ్యమంటావా?"

"చెబుతాను. కాని మీరు నమ్మరు." బెక్కుతూ అన్నది.

"నమ్మడం నమ్మకపోవడం ఆ తర్వాతి విషయం. ముందు నిజం చెప్పు." గర్జించాడు.

* * *

"మా నాన్న బడిపంతులు, నలుగురు సంతానం. అందరి కంటే నేను పెద్దదాన్ని."

"అది నాకు తెలుసు."

"అడ్డు ప్రశ్నలు వెయ్యకుండా వినండి. ఆ తర్వాత మీరు ఏంచేసినా భరించడానికే నిర్ణయించుకున్నాను." వసుధ కంఠంలోని తీవ్రతకు తలెత్తి చూశాడు. రామనాధం.

వసుధ కళ్ళు ఎర్రగా ఉన్నాయ్!

ఆ కళ్ళలో ఏదో నిర్ణయం కన్పిస్తున్నది.

ముఖం గంభీరంగా ఉన్నది.

దేనికైనా తెగించినట్టు కన్పించింది.

రామనాధం మనసులో ఏదో జంకు బయలుదేరింది.

ఆడది భయపడినంత వరకే మగవాడు తన ఆధిక్యతను చూపించడానికి ప్రయత్నిస్తాడు. కాని ఆమె ఎదురు తిరగడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుసుకుంటే నీళ్ళు కారిపోతాడు.

"ఉ! చెప్పు!"

"మరి మీ అడ్డు ప్రశ్నలు వెయ్యకూడదు."

"చెప్పు?"

"నేను ఇంటికి పెద్ద బిడ్డను. అమ్మ పది పాసుకాగానే పెళ్ళి చెయ్యమని పోరుపెట్టసాగింది.

"నాన్నకు నన్ను చదివించాలని ఉన్నది. నాకూ చదువు


*With best compliments from*

# GOLI ESWARIAH

Dealers in

**Papers, Boards and Printing Materials**

**General Bazar, SECUNDERABAD - A. P.**

Phone : 74386
Resi : 74383

Grams : **'FANCY PAPER'**
Secunderabad

కోవాలనే ఉన్నది. అమ్మ మాట వినిపించుకోకుండా బి. ఏ. వరకూ చదివాను. తమ్ముడు కూడా కాలేజీకి వచ్చాడు. చెల్లి పదిలో ఉన్నది. చిన్న తమ్ముడు చాలా చిన్నవాడు.

"అమ్మ ఆరోగ్యం క్షీణించసాగింది. నాన్న జీతం గొర్రె తోక లాంటిది. ఇల్లు గడవటం కష్టంగా ఉండేది. నాన్న ట్యూషన్స్ కూడా చెప్పేవాడు. నేను సాయంకాలం పూట ఇంటికి వచ్చినవాళ్ళకు ట్యూషన్ చెప్పేదాన్ని. ఇంటి పని కూడా చాలా వరకు నేనే చూసుకొనేదాన్ని. చదువుకోవడానికి సమయం దొరికేది కాదు.

"పెద్ద తమ్ముడు బొత్తిగా ఇంటి పరిస్థితి అర్థంచేసుకొనేవాడు కాదు. వాడికి స్వార్థం ఎక్కువ. ఇంట్లో ఎవరు తిన్నా తినకపోయినా వాడికి మాత్రం అన్నీ అమర్చి పెట్టాల్సి వచ్చేది.

నేను బి. ఏ. తప్పాను.

నేను బి. ఏ. పాసయి ఏదైనా ఉద్యోగం చేసి ఇంటికి సాయపడతానని నాన్న ఎన్నో ఆశలు పెంచుకున్నాడు.

ఎంప్లాయిమెంటు ఆఫీసులో పేరు రిజిష్టర్ చేశాను. రెండేళ్లు అయినా కాల్ రాలేదు. ఎం. ఏ. లకే ఉద్యోగాలు దొరకని రోజుల్లో బొత్తిగా పరపతి లేని నాకు ఉద్యోగం దొరకడం అంత తేలిక కాదనీ, నాకూ, నాన్నకూ కూడా అర్థంఅయింది.

"నేను ట్యూషన్స్ చెబుతూ ఉండేదాన్ని.

అమ్మ నా పెళ్లి చెయ్యమని రోజూ నాన్నతో గొడవపడేది.

"మా చెల్లెలికి చదువుమీద ధ్యాస లేదు. ఎప్పుడూ షోకులు చేసుకొనేది. స్నేహితుల ఇళ్లకని ఊరిమీద తిరుగుతూ ఉండేది. స్నేహితురాళ్లు ఇచ్చారని రకరకాల గిల్టు నగలూ చౌకబారు సిల్కు చీరలూ తెచ్చుకొనేది.

ఒక రోజు........

"ఎక్కడి కెళ్ళావ్ ? ఇవన్నీ ఎవరిచ్చారు ?" నాన్న అడిగాడు.

సరళ సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా చూసి లోపలకు వెళ్ళబోయింది.

"ఏమిటా పొగరు ? సమాధానం చెప్పు !"

"నా స్నేహితురాలు ఇచ్చింది."

"నీకు సిగ్గులేదూ ఊళ్లో వాళ్ళ దగ్గిర దేబిరించడానికి ? నా కడపున చెడబుట్టావు గదే !" అరిచాడు నాన్న.

"నేను నీ కడుపున చెడబుట్టానో లేదో నాకు తెలియదు. కాని నీలాంటి చేతగానివాడి కడుపున పుట్టినందుకు విచారిస్తున్నాను. పెళ్లీడుకు వచ్చిన ఆడపిల్లలకు కొంచెం అనువైన బట్టలు కూడా ఇవ్వలేవు. పెళ్లి చెయ్యలేవు. పైగా నీతులు బోధిస్తావు !"

"నాన్న సర్పద్రష్టునిలా నిలబడిపోయాడు.

పున్నయ్య మాస్టారు అంటే ఆ ఊళ్లో అందరూ గౌరవిస్తారు. విద్యార్థులకు ఆయన మాట వేదవాక్కు. ఎవరి చేతా ఒక్క మాట పడ్డవాడు కాదు. అలాంటి ఆయన తన కడుపున పుట్టిన బిడ్డ అన్ని మాటలు అంటూంటే నోరు పడిపోయినవాడిలా చూడటం తప్పించి ఇంకేమీ అనలేక పోయాడు.

అమ్మ వంటింట్లో ఉన్నది. చెల్లెలు నాన్నను అన్న మాటలు అన్నట్టు అమ్మకు తెలియదు.

పక్క గదిలో ఉన్న నాకు మాత్రం అన్ని మాటలూ స్పష్టంగానే వినిపించాయి.

నేను చెల్లెల్ని మందలించాను.

"నువ్వు కల్పించుకోకు. బి. ఏ. చదివావు. ఎందుకూ ? ఉద్యోగం రాలేదు. ఇరవై రెండేళ్లు వచ్చినా పెళ్లి కాలేదు. కనీసం ప్రేమించి పెళ్లిచేసుకోవడం కూడా చేతకాదు. నీలా నేను కాలేజీలో చదివితే ?-"

"సరూ !" దాదాపు అరిచింది వసుధ.

సరళ నాకేసి జాలిగా చూస్తూ, "అక్కా ! నిన్ను చూస్తే జాలివేస్తుంది."

"నోరు ముయ్ !" అరిచాను.

"అదోలా నవ్వుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయింది సరళ.

"నాకంటే నాలుగేళ్ళు చిన్నది. నన్ను అవమానించింది. నా మనసులో తుమ్మముల్లు గుచ్చుకున్నట్టు బాధపడసాగాను.

అమ్మ పిలిస్తే బయటికి వచ్చాను.

నాన్న ఇంకా స్థాణువులా అక్కడే నిల్చుని ఉన్నాడు.

నాన్న బాధ చూసి నా బాధను మర్చిపోయాను.

"నాన్నా !" పిల్చాను,

"ఏమిటమ్మా !" తృళ్లిపడి యాదాలాపంగా ప్రశ్నించాడు.

"నాన్నా ! స్కూలుకు టైం అయింది."

"ఆఁ ఆఁ అవును." అంటూ లోపలకు వెళ్ళి చిరుగులు పట్టిన నల్ల కోటు వేసుకు, పాత గొడుగు తీసుకొని బయలుదేరాడు

ఆ గొడుగు వర్షాకాలం పనికిరాదు. ఎండను కొంతవరకు ఆపుతుంది. తనకు ఊహ తెలిసినప్పటినుంచీ నాన్న అదే గొడుగును వాడుతున్నాడు.

"అయ్యో అదేమిటండీ అన్నం తినకుండానే బయలుదేరారు ?"

జవాబు చెప్పకుండా చెరచెర వెళ్ళిపోతున్న భర్తవైపు అమ్మ చూస్తూ నిల్చుంది.

"నా రాత !" తల బాదుకుంటూ లోపలకు వెళ్ళింది.

అమ్మను తేరిపార చూశాను. రంగు మాసిన ఆ చీర అసలు రంగేమిటో కూడా తెలుసుకోవడం కష్టమే. చిరుగులు పట్టిన చోట కందికాయ కుట్టు కుట్టుకుంది. రవిక భుజంమీద కుట్టుకున్న చోట చిరుగు పిగిలి పచ్చటి చర్మం తొంగిచూస్తున్నది.

నాకేసి చూసుకున్నాను. నలభై నంబరు గుంటూరు నేత చీర. పూర్తిగా రంగు వెలవలేదు. అమ్మ చీరకంటే బాగానే ఉన్నది.

పాపం నాన్న మాత్రం ఏం చేస్తాడు.

ధరలు మండిపోతున్నయ్ ! ఎంత వచ్చినా తిండికే చాలదు. పైగా ఇద్దరు తమ్ముళ్ళు గుంటూర్లో చదువుతున్నారు. నాకు ఉద్యోగం వస్తే నాన్నకు కొంచెం పరుగులాంటి జీవితంలో ఓ క్షణం నిల్చుని ఊపిరి పీల్చుకొనే అవకాశం దొరుకుతుంది. నేను బి. ఏ. పాసయి అప్పటికి రెండేళ్ళు అయింది. ఇంకా ఉద్యోగం దొరకలేదు. ఊరికినే ఉండటం ఎందుకని టైపు ఇన్‌స్టిట్యూట్‌కెళ్ళి రోజూ ఒక గంట టైపు నేర్చుకుంటున్నాను. ఏమైనా సరే, ఏ ఉద్యోగం అయినా సరే, బాల విహార్ ఆయా ఉద్యోగం అయినా చెయ్యాలని ఆ రోజు నిర్ణయించుకున్నాను.

ముఖం కడుక్కొని తల దువ్వుకొని, ఉతికిన చీర కట్టుకొని బయలుదేరాను.

"ఎక్కడికే ?" అన్నది అమ్మ.

నేను సమాధానం ఇవ్వలేదు.

ఉసిగా బయటికి వెళ్ళిపోయాను.

తిన్నగా సోషల్ వెల్‌ఫేర్ హాస్టల్‌కు వెళ్ళాను.

అక్కడ వంట మనిషి మానేసిందట. వంటచేసే ఉద్యోగం దొరికింది. నెలకు రెండు పూటలా అన్నం పెట్టి వంద రూపాయలు జీతం ఇస్తామన్నారు. నేను సంతోషంగా ఒప్పుకున్నాను."

అంతవరకు చెప్పి వసుధ భర్త ముఖంలోకి చూసింది.

అతను శ్రద్ధగా వింటున్నాడు. కళ్ళలో ఆర్ద్రత కన్పించింది.

వసుధ మళ్ళీ ప్రారంభించింది.

"పన్నెండు గంటలకు చెమట్లు కక్కుకుంటూ ఇంటికి వచ్చాను. అంత ఎండలో వచ్చినా మనసు ఉల్లాసంగా ఉన్నది."

"అమ్మా ! అమ్మా !"

"ఏమిటే ? ఇంత ఎండలో ఎక్కడికెళ్ళావ్ ?"

"నాకు ఉద్యోగం దొరికిందమ్మా !"


With Best Compliments From :

# KANTHI PRINTING INKS PRIVATE LIMITED

Anjaneya Panthulu Street, Vijayawada - 520 010.

Phones : Fact : 74083 Off : 72060 Resi : 77047

*Manufacturers of :*

**Quality Printing Inks for Letter Prees, Offset and Litho**

*Distributors for Twin Cities*

**SRI LAKSHMI ENTERPRISES**

Raj Bhavan Road, Hyderabad-500 004. Phone : 35842

అమ్మ నమ్మలేనట్లు నాముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

"ఏటమ్మా అలా చూస్తావ్ ? నిజమే చెబుతున్నాను. జీతం వంద రూపాయలు. రెండు పూటలా భోజనం అక్కడే. ఇంట్లో నా ఖర్చు ఉండదు."

"ఏం ఉద్యోగం అక్కా ?" అంటూ బయటికి వచ్చింది సరళ.

"సోషల్ వెల్ ఫేర్ హాస్టల్లో వంటమనిషి ఉద్యోగం ?"

చెల్లీ, అమ్మా ఇద్దరూ పిచ్చిచూపులు చూశారు.

"ఆ ఉద్యోగం చెయ్యడానికి బి. ఏ. చదవడం ఎందుకూ? అమ్మ కూడా చెయ్యగలదు." అన్నది సరళ వ్యంగ్యంగా.

"బి. ఏ. చదువుకు తగిన ఉద్యోగం దొరికేంత వరకూ! డిగ్నిటీ ఆఫ్ లేబర్."

"ఏమిటే నీ కేమైనా మతిపోయిందా ?" నాన్న వింటే ఇంకేమన్నా ఉందా ? అసలే ఆయనకు అభిమానం జాస్తి. కూతురు వంటమనిషిగా పనిచేస్తుందంటే మళ్ళీ ఆయన వీధి ముఖం చూడగలరా."

నిజమే ! ఈ దేశంలో మధ్య తరగతి ముఖ్యంగా లోయర్ మిడిల్ క్లాసు మనుషులకు ఉన్న భేషజాలూ హిపోక్రసీ మరెవరికీ ఉండవు. కడుపు కాలుతున్నా పరువునూ ప్రతిష్ఠనూ కౌగలించుకొని వేలాడతారు. ఈ మధ్య తరగతి నుంచే ఎక్కువ మంది ఆడపిల్లలు ... పెళ్ళిళ్ళు కాక ఎం... చివరకు ఏ ప్రే... ప్రేమించి వీధిలో పడుతున్నారు. ...క కూడా ... హౌస్‌కో చేరుతున్నారు. కట్నాల గొడ... బావిలో ... పిల్లల్ని పోషించలేని తల్లి ముందువాళ్ళను ... నాలు... ఆ తర్వాత తను దూకుతుంది. అంతేగాని ... న... చాకిరి చేసుకున్నా పిల్లల్ని బ్రతికించుకోవచ్చును అ...

ఎందుకని ?

పరువు !

ప్రతిష్ఠ !

సంప్రదాయం !

ఇవన్నీ అడ్డొస్తాయి. వాళ్ళ తాతలు నేతులు తాగారనే విషయాన్ని మర్చిపోలేరు. ఆ విషయాన్ని పైగా గొప్పగా చెప్పుకొని, తమ వంశం ఎంత గొప్పదో ఎదుటివారికి తెలపాలని తాపత్రయపడ్తారు.

ఒకోసారి భర్తా భార్యా కూడబలుక్కొని పిల్లలకు ముందు విషంపెట్టి, ఆ తర్వాత వాళ్ళు తిన్నారనీ; కుటుంబం యావత్తూ చచ్చిపోయిందనీ వార్త చదువుతాం లేక వింటాం.

వీళ్ళు కూలికి వెళ్ళలేరు.

అది వారి దృష్టిలో పరువు తక్కువ పని !

ఉద్యోగాలు దొరకవు !


Grams : PICASSO
Telex : 0495-252

Phones : 4282
4283
5679

**Coromandel Paints & Chemicals Limited**

10-1-32 WALTAIR UPLANDS
VISAKHAPATNAM - 530 003

*Manufacturers of*

All Varieties of Paints - Decorative, Industrial, Marine and Sophisticated Coatings.

(Technical collaboration : M/s British Paints)

*Regd. Office :* 9-30-2, Siripuram, Visakhapatnam - 3 Phone : 3249

*Factory* : M Pendurty, Visakhapatnam Dt. Phone : 9263, 9254

ఇక చావు ఒక్కటే మార్గంగా కన్పిస్తుంది.

ప్రాణాలు వదులుకుంటారు. కాని సాంప్రదాయం మీది గౌరవాన్ని వదులుకోలేరు.

"ఏమిటే ఆలోచిస్తున్నావ్ ?"

అమ్మ మాటలతో ఆలోచనల నుంచి బయటపడ్డాను.

"అప్పా కూతురు చదువో! చదువో! అన్నారు. ఇప్పుడేమైంది ?"

"ఏమైందే ?" వళ్ళు మండి అడిగాను.

"నువ్వు బి. ఏ. పాసయావు. బోలెడంత ఖర్చుపెట్టి చదివించాం. ఉద్యోగం రాలేదు. పెళ్ళి చెయ్యాలంటే నీకంటే ఎక్కువ చదువుకున్నవాణ్ణి తేవాలి. ఎం. ఏ. చదివిన వాడికి పాతిక వేలన్నా కట్నం పొయ్యాలి."

"మరి నేను చదువుకోకపోతే ?"

"ఏ యాయవారం చేసుకొనేవాడికో, గుడి పూజారికో వెయ్యో రెండు వేలో ఇచ్చి ఆ మూడు ముళ్ళూ వేయించే వాళ్ళం."

"ఇప్పుడు మాత్రం నేను కాదన్నానా? ఆ పనే చెయ్యండి." విసురుగా అన్నాను.

"నిన్ను ఏ పూజారి తన కొడుక్కి చేసుకుంటాడే!"

"ఏం ?"

"బి. ఏ. పాసయావు. అతని కొడుకు నాలుగు సంస్కృత శ్లోకాలు చదువుకొని తండ్రిలాగే పూజారి అవుతాడు. అలాంటి వాడెవడూ బి. ఏ. పాసయినదాన్ని చేసుకోడు."

"ఏం? ఎందుకు చేసుకోకూడదూ? పెద్ద పెద్ద చదువులు చదివిన మగవాళ్ళను అక్షరం ముక్క రాని ఆడవాళ్ళు చేసుకొని కాపరాలు చెయ్యడంలా? ఆ పని మగవాడెందుకు చెయ్యలేకపోతున్నాడు ?"

"అది మగవాడి అహంకారం తల్లీ!"

నాతోపాటు అమ్మకూడా తృళ్ళిపడి వెనక్కి చూసింది.

నాన్న నిలబడి ఉన్నాడు.

అమ్మ గబగబా లోపలకు వెళ్ళింది.

నేనూ వెళ్ళబోయాను.

"తల్లీ ఇలా రా!"

నాన్న దగ్గరగా వెళ్ళి తలవంచుకొని నిల్చున్నాను.

"నేను వచ్చి చాలాసేపయిందమ్మా! మీ మాటలు విన్నాను. ఎన్నో ఆశలు పెట్టుకొని నిన్ను చదివించాను. కాని ఏంలాభం? చివరికి నువ్వు వంటపని చెయ్యడానికి సిద్ధపడ్డావు. నేను ఇంకా బ్రతికే ఉన్నానమ్మా!"

"నాన్నా!"

"నువ్వనట్టు డిగ్నిటీ ఆఫ్ లేబర్ మన వాళ్లకు ఇంకా


*With the best compliments of*

# BALARAM & Co.,

ENGINEERS & CONTRACTORS

Phone : 5328

*Specialists for*

BRIDGES, BUILDINGS, WORKSHOPS AND ROAD CONSTRUCTION etc.

**D G N P, VISAKHAPATNAM - 14**

తెలియదు. నువ్వు ఆ పని చేస్తే నన్ను తలెత్తుకోనివ్వరు. నీకు కట్నం ఇచ్చి నీ కంటే ఎక్కువ చదివినవాణ్ణి చెయ్యలేను. నువ్వన్నట్టు నీకంటే తక్కువ చదివిన వాణ్ణి వెతికి చెయ్యగలను. కాని నువ్వు నీ బి.ఏ. డిగ్రీని మర్చిపోవాలి." ఎంతో బాధగా అన్నాడు నాన్న.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నాన్న నా తల నిమురుతూ ఎంతోసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు.

*　　*　　*

ఆరోజునుంచి సంబంధాలు వెతకసాగాడు నాన్న.

ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్లూ చేశాడు. ఇద్దరి అల్లుళ్ళకూ ఐదేసి వేలు ఇల్లుతాకట్టుపెట్టి ఇచ్చాడు."

నిట్టూర్చింది వసుధ. భర్తముఖంలోకి చూసింది.

ఇంకా అతని ముఖంలోని కోపం పూర్తిగా పోయినట్టు అన్పించలేదు.

"మా ఆఫీసరుగారి భార్య నీ స్నేహితురాలేగా. ఇంకేం ఉద్యోగం సంపాదించుకో. బి.ఏ. చదివావు. నాకంటే పెద్ద ఉద్యోగమే వస్తుంది."

వసుధ అదోలా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావ్!"

"నేను బి. ఏ. చదివినట్టు మర్చిపోయి మూడు నెలలకు పైగా అయింది.

"అంటే పెళ్లి అయిన నాటినుంచేనా ?"

"కాదు నా సర్టిఫికెట్ చింపేసిన నాటినుంచి."

"చింపేశావా ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును ?"

"ఎందుకనీ ?"

"నాకు దాంతో పనిలేదు కనక ?"

రామనాథం ముఖంలో ప్రశాంతత నెలకొన్నది.

"నీకంటే తక్కువ చదివినవాణ్ణి చేసుకోవాలంటే నీకేమీ అనిపించలేదా ?"

"లేదు. చెబుతున్నాగా నా చదువు గురించి పూర్తిగా మర్చిపోయానని ?"

అన్నం తిన్నంతసేపూ మౌనంగానే ఉన్నాడు రామనాథం.

వంటిల్లు సర్దివచ్చి పడుకుంది వసుధ.

"వసూ! ఒక మాట అడుగుతాను నిజం చెబుతావా!" లాలనగా దగ్గరకు లాక్కుంటూ అన్నాడు.

"అడగండి! నాకు అబద్ధాలు చెప్పే అలవాటు ఇంత వరకు లేదు. ఇకముందు సంగతి నాకు తెలియదు."

"కాలేజీలో చదివావుగదా ?"

"ఊఁ."

"అది ఆడపిల్లల కాలేజీయేనా ?"


*With best compliments from*

# SWAGATH HOTEL

**MAIN ROAD, VISAKHAPATNAM**

Phone : 4544

"కాదు మగపిల్లలు కూడా చదివే కాలేజీలో చదివాను"

"మగపిల్లలూ ఆడపిల్లలూ కలిసి చదువుకొనే కాలేజీల్లో ప్రేమించుకుంటారటగా ? మరి నువ్వు ఎవర్నీ ప్రేమించ లేదూ ?"

"ఊహూ ?"

" నువ్వు అందంగా ఉంటావు. మరి నిన్ను ఎవరూ ప్రేమించలేదా ?"

"నాకు తెలియదు ?"

"అంటే ?"

"ఎవరూ నాతో నన్ను ప్రేమిస్తున్నట్టు అనలేదు ?"

"నేను నమ్మను ?"

వసుధకు భర్తమీద కోపంరాలేదు. అసహ్యం వేసింది. తన నడుంమీద ఉన్న అతని చేతిని తీసేసింది.

"నమ్మకం లేకపోతే అడగడం ఎందుకూ ! ఆ కాలేజీకి వెళ్ళి వాకబుచెయ్యండి. లేకపోతే మీ ఆఫీసరుగారి భార్యను అడగండి" తీవ్రంగా అన్నది వసుధ.

రామనాథం మనసు కుదుటపడింది.

"కోపం వచ్చిందా ?" అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

వసుధకు చివ్వున లేచి వెళ్ళాలనిపించింది.

అయినా అలా చెయ్యలేకపోయింది.

వసుధకు నిద్ర పట్టలేదు.

రామనాథం నోరు తెరిచి గురకపెడుతున్నాడు.

అతని ముఖంలోకి చూసింది.

చూపులు తిప్పుకుంది. ఎలుగుబంటిలా కన్పించాడు. అంతకు ముందు ఆమెకు అతను పెళ్ళయిన ఈ మూడు నెలల్లోనూ అనిపించ లేదు. ఎంత మొరటుగా ఉన్నా అతను తన భర్త అతని అందావిన్ని గురించి ఆలోచించ కూడదని సరిపెట్టుకుంది.

కాని..... ఈనాడు అతని నిజస్వరూపం ఆమెకు కన్పించింది.

తప్పంతా అతనిదేనా ?

తను బి.ఏ. చదివినట్టు చెప్పలేదు. పదో క్లాసు చదువుతూ మానేసినట్టు నాన్న పెళ్ళికి ముందు చెప్పాడు. పెళ్ళికాగానే తను భర్తతో హైదరాబాద్ వచ్చేసింది. ఎప్పటికైనా అసలు విషయం బయటపడుతుందని తను భయపడుతూనే ఉన్నది. అందుకే సమయం చూసి తనే చెప్పాలనుకుంది.

గురక శబ్దం మారింది.

తిరిగి చూసింది.

ఈ సారి నోరు మూసుకొని ఉన్నాడు. ముక్కుపుటాలు ఎగురుతున్నాయ్. తమాషా శబ్దం వస్తోంది.

*With best compliments from*

Phones : Off : 677
Res : 776

# BAND BOX Enterprises

MAIN ROAD.

CHIRALA

*Manufacturers of :*

**Steel Almairahs, Foam Beds & Wooden Furniture**

గోడవైపుకు తిరిగి నిద్రపోవడానికి ప్రయత్నించసాగింది.

ఆమెకు హృదయాన్ని ఎవరో పిండివేస్తున్నట్టు అనిపించసాగింది.

ఈ మనిషితో జీవితం అంతా గడిచిపోవాల! కళ్ళవెంట నీరు కారుతోంది.

తలకింద దిండు చల్లగా తగులుతోంది.

*   *   *

వసుధ భయపడినట్లు మళ్లీ రామనాథం ఆమె బి. ఏ. డిగ్రీని గురించి కానీ, కాలేజీ జీవితం గురించి గానీ ప్రశ్నించలేదు.

రామనాధానికి ప్రొమోషన్ వచ్చింది. యు. డి. సి. నుంచి సూపర్నెంటు అయ్యాడు. అదంతా వసుధ అదృష్టంగానే భావించాడు. ఇంకా ఐదేళ్ల సర్వీసు ఉన్న వెంకటరంగం పాముకరిచి అనుకోకుండా చచ్చిపోయాడు. దాంతో సీనియారిటీ ప్రకారం రామనాధానికి ప్రమోషన్ వచ్చింది.

అతని భార్యలో తప్పు పడదామన్నా దొరకడం లేదు. అతనుకూడా క్రమంగా భార్య తనకంటే ఎక్కువ చదువుకున్నదన్న విషయం మర్చిపోయాడు.

రామనాధానికి తల్లి లేదు. అక్కాచెల్లెళ్లు లేరు.

తండ్రి చిన్నకొడుకు దగ్గర ఉంటాడు. రామనాధం తమ్ముడు తహసీల్‌దారుగా గుంటూరు జిల్లాలో పనిచేస్తున్నాడు.

రామనాధానికి చదువు అబ్బలేదు. మూడోసారి పది పాసయ్యాడు. తండ్రి ప్రయత్నంతో గవర్నమెంటు ఉద్యోగం యల్. డి. సి. గా దొరికింది. తమ్ముడికి బి. ఏ. వరకూ చదువు చెప్పించి తనకు పది పాసుకాగానే ఉద్యోగంలో వేసిన తండ్రి అంటే అతనికి గిట్టదు.

వసుధ సంసారం వడుదుడుకులు లేకుండా సాగిపోతున్నది. ఆమెకు కావాల్సింది కూడా అదే.

ఆమె కన్న కలలు ఏనాడో కరిగిపోయాయి. గతాన్ని పెళ్లిరోజునే పాతిపెట్టింది, జీవిత వాస్తవాన్ని అర్థంచేసుకున్న వసుధలో జీవితంపట్ల నిర్లిప్తత ఏర్పడింది. అతి సామాన్య గృహిణిగా మాత్రమే మిగిలిపోయింది. తీరిక సమయాల్లో పుస్తకాలు చదవదు. గలీబులు మీద ఎంబ్రాయిడరీ చేస్తుంది. కర్టెన్లు కుడుతుంది. ఆ చిన్న ఇంటినే వీలయినంత శుభ్రంగా అందంగా అలంకరించుకుంటుంది.

భర్త మనసు తెలుసుకొని ప్రవర్తిస్తుంది. ఆమె తనకంటే ఎక్కువ చదువుకున్నదనే ఆలోచన భర్తలో రాకుండా చెయ్యడానికి ప్రయత్నిస్తున్నది. ఆత్మహీనతాభావం ఏర్పడిన మగవాడితో జీవితం గడపడం నరకప్రాయం అని ఆమెకు తెలుసు. అలాంటివారికి తామే పైచెయ్యిగా ఉన్నట్టు భ్రమ కలిగించాలి.


*With best compliments from :*

# AMARSARIA TRADERS

**Suppliers of stationery & printing materials**

**15-9-373/1, Mahaboob Gunj**
**Hyderabad-500 012**

**Phone : 46770** **Grams : Amarsaria**

*Distributors for*

M/s. Rainbow Ink & Varnish Mfg. Co. Pvt. Ltd., Madras.
M/s. Nurit Inks Pvt. Ltd., Madras
M/s. Gujarati Type Foundry, Bombay
M/s. Okara (India), Bombay

రామనాథం మొరటుగా ఉంటాడు. కాని అతని మనసులో కాఠిన్యంతోపాటు మెతకతనం కూడా ఉన్నదని అర్థంచేసుకో గలిగింది వసుధ. అతను పైకి కన్పించేటంత దుర్మార్గుడు కాడు. అతనికి తన రూపం గురించి తెలుసు. తన తెలివి తేటలగురించి తెలుసు. అందువల్లనే చిన్నతనంలో ఏర్పడిన ఆత్మహీనతాభావం అతని స్వభావంలో కరుకుదనాన్ని తెచ్చి పెట్టింది.

ఒకరోజు రామనాథం వచ్చేసరికి వసుధ బద్ధకంగా పడుకొని ఉన్నది. ఆ సమయంలో సాధారణంగా ఆమె పడుకోదు. స్నానంచేసి శుభ్రమైన బట్టలు కట్టుకొని భర్త కొసం ఎదురుచూస్తుంది చిరునవ్వుతో ఎదురొతుంది.

ఐదు నిముషాల్లో వేడివేడి కాఫీ అందిస్తుంది.

"ఏం వసూ పడుకున్నావ్ ?" బట్టలు మార్చుకుంటూ అడిగాడు రామనాథం.

"ఏం లేదు. కొంచెం కళ్లు తిరుగుతున్నయ్. ఇంతకు ముందే వాంతి అయింది," అన్నది కొంచెం సిగ్గుపడుతూ.

"అరే! ఏమీ లేదంటావేం? పద! ఈ వీధి చివర్లోనే డాక్టర్ ఉన్నాడు. నేను రిక్షా తెస్తాను." విడిచిన షర్టును మళ్లీ తగిలించుకుంటూ అన్నాడు.

తన భర్తకు అంత సున్నితంగా చెబితే ఏదీ అర్థంకాదని వసుధకు తెలుసు.

"డాక్టరు అక్కర్లేదండీ? నాకు జబ్బేమీ లేదు."

"మరి?"

మంచంమీద అప్పటికే లేచికూర్చున్న వసుధ కళ్లు సిగ్గుతో వాలిపోయాయి.

అయినా రామనాధానికి అర్థంకాలేదు.

"మంచిదానివే! అంత నీరసంగా ఉన్నావ్? ఏమైందో ఒకసారి డాక్టరుకు చూపించుకుంటే మంచిది." ఆతృతగా అని రెండడుగులు ముందుకువేశాడు.

వసుధ చివ్వున లేచి వచ్చి అతని చెయ్యి పుచ్చుకుంది.

"నాకే జబ్బూ లేదు. మీరు తండ్రి కాబోతున్నారు!" గబుక్కున అనేసి సిగ్గుతో తలవంచుకుంది.

ఏంమనిషి బాబూ! సటిల్‌గా చెబితే ఒక్క విషయం కూడా అర్థంకాదు.

"నిజంగా?" అంటూ భార్యను రెండుచేతులతో పైకెత్తి గిరగిరా తిరిగాడు.

"మీ సరసం బాగానే ఉంది. నాకసలే కళ్ళు తిరుగుతున్నయ్"! అన్నది వసుధ.

"సారీ!" అంటూ ఆమెను పదిలంగా మంచంమీద పడుకో బెట్టాడు.

* * *


*EARN EFFECTIVE INTEREST RATE AT 14.73%*
*FOR, IN OUR GRUHALAXMI DEPOSITE SCHEME,*
*YOUR MONEY MORE THAN DOUBLES IN 7 YEARS.*

| Sl. No. | Period in months | Amount of Deposit Rs. 500/- | Rs. 1,000/- | Rs. 5,000/- | Effective rate of interest |
|---|---|---|---|---|---|
| | | Rs. P. | Rs. P. | Rs. P. | |
| 1. | 84 | 1,015.50 | 2,031.00 | 10,155.00 | 14.73% |
| 2. | 144 | 1,684.25 | 3,36850 | 16,842.50 | 19.74% |

Laxmi, a thrifty housewife, finds that APCOB's Gruhalaxmi Deposit Scheme is the most profitable investment of her savings, for, her money multiplies very fast with APCOB.
For further details, please contact :

**The Andhra Pradesh State Co-operative Bank Ltd.,**
[A SCHEDULED BANK]
H. O : Troop Bazar, Hyderabad - 500 001. Tel. No. 44481.

**G. KUMARASWAMY REDDY, I.A.S.,**
**Managing Director.**

ఇ"వన్నీ ఎందుకండీ?"

"పళ్లరసం తాగితే మంచిదట. ఈ టానిక్కు కూడా రోజూ అన్నం తినగానే తాగాలి?"

"బాగానే ఉంది వరస. రోజూ పళ్లరసం తాగడం మన మధ్యతరగతి కుటుంబాల్లో అయేపనా?"

"ఏం ఇప్పుడు మనకేం తక్కువైంది?"

"మనం ఇప్పటినుంచే జాగ్రత్తపడకపోతే...."

"వచ్చేవాళ్లకోసమా?" అంటూ పకపక నవ్వాడు రామనాధం.

అతను నవ్వుతుంటే చెడిపోయిన టేబుల్ ఫాన్ చేసే శబ్దంలా చిరాకును కలిగిస్తుంది వసుధకు.

ఈ మనిషి నవ్వకుండా వుంటేనే బాగుంటాడు అనుకునేది.

ఆ రోజు అతని నవ్వు ఆమెకు ఎబ్బెట్టుగా అన్పించలేదు.

వసుధ కాపరానికి వచ్చి ఐదు నెలలైంది.

నెల రోజులుగా భర్త ఆమెను అపురూపంగా చూసుకుంటున్నాడు.

వసుధ చెల్లెలు సరళ భర్త అందంగా ఉంటాడు. వివాహం అయిన కొత్తలోనే అతనికి లేని వ్యసనం లేదని చెల్లెలు బాధపడుతూ రాసింది. చెల్లెల్ని ఓదారుస్తూ ఎన్నో ఉత్తరాలు తనూ రాసింది. ఆ దృష్టితో చూస్తే తనే అదృష్టవంతురాలు. బి. ఎ. పాసయి దాచిపెట్టి పెళ్ళిచేస్తే అకస్మాత్తుగా విన్నప్పుడు ఏ భర్త అయినా అలాగే ప్రవర్తిస్తాడు. కాకపోతే కాలేజీలో చదివిన ఆడపిల్లలందరికీ ఏదో ప్రేమ వ్యవహారం ఉండే ఉంటుందనే అనుమానం మాత్రం ఆయన్ను వదల్లేదు. ఆ విషయం మీద ఇలా అప్పుడప్పుడు అడుగుతూనే ఉంటాడు. ఇప్పుడు తను తల్లి కాబోతున్న సంగతి తెలిసినప్పటి నుంచీ ఆ సంతోషంలో ఆ విషయం మర్చిపోయినట్టే ఉన్నాడు. ఆయనకు పిల్లలంటే ఇష్టం అని తనకు తెలుసు. ఎదురింటి పిల్లలతో రోజూ కాసేపయినా కూర్చుని కాలం గడుపుతాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

భర్త ఎప్పుడు వచ్చాడో చూడలేదు.

"ఆఁ ఏం లేదు. మావాళ్ళకు ఉత్తరం రాస్తే....?"

"అదా! నేను రాశాను. ఇవ్వాళే మీ నాన్న ఆఫీసు అడ్రసుకు సమాధానం రాశాడు. ఏడోనెల రాగానే తీసుకెళ్తామని రాశాడు."

"అంత త్వరగా ఎందుకూ? ఇక్కడ మీకు ఇబ్బంది కాదూ?"

భార్య మాటలకు రామనాధం పొంగిపోయాడు.

"నాకేం ఇబ్బందీ? హోటల్లో తింటాను. అక్కడైతే నీకు విశ్రాంతి దొరుకుతుంది_" అన్నాడు రామనాధం

* * *


or all your requirements of PaperBags, Polythene Bags, Butter Paper Bags & Envelopes

**Andhra Paper Bag Company**

**General Bazaar, Secunderabad - 500 003; Tel. : 72749**

*Seasons Greetings & Best wishes from :*

**Mysore Paper Corporation**

General Bazar, Secunderabad - 500 003; Tel : 72749

**Agents for :**

Sun Paper Company — Mfrs. of 'Lustre Cote' Art Paper, Art Card and Chromo paper. Rohit Pulp and Paper Mills Ltd., — Mfrs 'Pearl Glow' Art Paper, Art Card, Chromo Paper, Bankers Ledger and White Maplitho. Mysore Paper Mills Ltd. — Mfrs. of 'Bison' brand White and Kraft Paper.

ఏడోనెల రాగానే వసుధను పెద్ద తమ్ముడు వచ్చి తీసు కెళ్ళాడు.

ఆమె వెళ్ళాక ఇరవై రోజులకే మామగారినుంచి ఉత్తరం వచ్చింది. ఆడపిల్ల పుట్టిందని రాశాడు.

వసుధ ప్రసవించిందనీ, ఏడో నెలలో పుట్టడంవల్ల పిల్ల బలహీనంగా ఉన్నదనీ రాశాడు.

రామనాథం ఆనందానికి అంతులేదు. ఆఫీసుకు వెళ్ళగానే అందరికీ పార్టీ ఇచ్చాడు. విషయం విని కొందరు గుసగుస లాడటం గమనించాడు. అతని సెక్షన్‌లో పనిచేసే సూర్య నారాయణ ముసిముసిగా నవ్వుతూ "మీ భార్య బి. ఏ. పాస యిందటగా ?" అన్నాడు.

రామనాథం చివ్వున తలెత్తి చూశాడు.

"ఎవరు చెప్పారు ?"

"ఇంజినీరుగారి పి. ఏ. చెప్పాడు."

"మీకు పెళ్ళయి ఎన్నెల్లు అయింది ?" సోమయాజులు అడిగాడు.

రామనాథం తల తిరిగిపోయింది.

అవును ! తనకు పెళ్ళయి ఎనిమిది నెలలు పూర్తి కావ స్తున్నది. తన భార్య ఏడో నెలలో పిల్లను కన్నది.

అంటే ?

రామనాథం తలలో నరాలు చిట్లటానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపించింది. గుండెలో సముద్రంలా ఏదో హోరు పెడు తున్నది.

ఇందుకా బి. ఏ. చదివిన అందమైన పిల్లను పైగా ఐదు వేలు కట్నం ఇచ్చి తనలాంటి అనాకారికి అబద్ధం చెప్పి పెళ్లి చేసింది ?

తను అనుమానించినట్టే కాలేజీలో ఏదో ప్రేమ వ్యవ హారం ప్రారంభం అయివుంటుంది. వాడు ఇదిగో అడిగో అంటూ కొన్నేళ్లు గడిపేశాడు. నెల తప్పిందనగానే ముఖం చాటేశాడు.

మోసం !

దగా !

ఆఫీసులో కూర్చోలేకపోయాడు. అర్ధరోజు లీవు పెట్టి ఇంటికి వచ్చేశాడు.

ఇంట్లో కాలు నిలవలేదు.

ఇంటికి తాళంవేసి ఊరంతా పిచ్చివాడిలా తిరిగాడు. అయినా మనసు శాంత పడలేదు.

ఎంత నటన ?

ఎంత పతివ్రతలా ప్రవర్తించింది ?

వెళ్తూ వెళ్తూ తన ఆరోగ్యం జాగ్రత్త అంటూ ఎన్నిసార్లు చెప్పింది.

అప్పటికప్పుడే వెళ్ళి భార్య గొంతు నులిమెయ్యాలనీ పించింది.

తుపాకితో ఆమెనూ, ఆమె తండ్రినీ నిలబెట్టి కాల్చి వెయ్యాలనిపించింది.

వారం రోజులు ఆఫీసుకు శెలవుపెట్టాడు.

ఎనిమిదోరోజు ఆఫీసుకు వెళ్ళాడు.

"ఏమండీ శెలవు పెట్టారు ? కూతుర్ని చూడాలని వెళ్ళారా ?" అన్నాడు సత్యనారాయణ.

"ఆఁ అవును !"

"మరి అలా ఉన్నారేం ? పిల్లా తల్లీ క్షేమమా ?" సోమ యాజులు అడిగాడు.

"తల్లి బాగానే ఉంది. పిల్ల ఏడో నెలలో పుట్టడం వల్ల చాలా బలహీనంగా ఉన్నది. బతకడం కష్టమే" అన్నాడు.

"అయ్యో పాపం !" అన్నాడు సోమయాజులు.

అతని సానుభూతిలో మరో అర్థం లేదు.

"నేను ఏడో నెలలోనే పుట్టాను. చాలా రోజులు బతక ననుకున్నారు," అన్నాడు సూర్యనారాయణ.

రామనాథం సూర్యనారాయణ ముఖంలోకి చూశాడు. అతని ముఖంలో కానీ, కంఠంలో గానీ మరో అర్థం గోచ రించ లేదు.

"ఏడోనెలలో పుట్టిన పిల్లలు బ్రతుకుతారు. ఎనిమిదో నెలలో పుట్టినవాళ్లు బ్రతకరు" అన్నాడు సోమయాజులు.

రామనాథానికి వాళ్ల మాటలు పుండుమీద చల్లని మందు రాసినట్టు అయింది. గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు.

ఆఫీసు పని ప్రశాంతంగానే చెయ్యగలిగాడు.

అంతా తన అనుమానమే !

ఆ రోజు పాపం వాళ్లు ఏ అర్థంలేకుండానే మామూలుగా అడిగి ఉంటారు. తనకే అలా అనిపించి ఉండాలి. కాదు. కాదు. ఆ రోజు వాళ్ల ధోరణి వేరుగా ఉన్నది ఏడోనెలలో పిల్లలు పుట్టడం అసహజం కాదు కనక మరెవరికీ అనుమానం రాలేదు. వచ్చిన అనుమానం పోయి ఉంటుంది. సూర్యనారాయణ కూడా ఏడోనెలలోనే పుట్టాడట.

రామనాథానికి రెక్కలు కట్టుకెళ్ళి పిల్లను చూడాలని పించింది. మామగారు ఒకసారి వచ్చివెళ్ళమని రాశారు.

హుషారుగా ఆ రాత్రి హోటల్లో భోజనం చేసివచ్చి పడు కున్నాడు.

మళ్ళీ బుర్రలో అనుమానపు పురుగు కదలసాగింది.

బయటివాళ్లు నమ్మారు. తన పరువు పోలేదు.

కాని....కాని....తనెలా నమ్మగలడు !

వసుధ బి. ఏ.

ఆ సంగతి గోప్యంగా పెట్టి పెళ్ళిచేశారు.

ఆ రోజు ఇంజనీరుగారి భార్య ఆ మాట అనేసరికి వసుధ ముఖంలో రక్తంచుక్కలేదు. గాభరాపడిపోయింది. ఆ ముఖం ఇప్పటికీ తనకు కళ్ళకు కట్టినట్టే కన్పిస్తున్నది.

రామనాథంలో అశాంతి ఎక్కువైంది.

పిల్లకు ఐదోనెల వచ్చిందనీ, కొంచెం వళ్ళు చేసిందనీ, అచ్చు తల్లిపోలికేనని అందరూ అంటున్నారనీ, వసుధ ఉత్తరం రాసింది. పిల్ల పుట్టాక చూడటానికి రాకపోగా, కనీసం ఒక ఉత్తరం ముక్కైనా రాయలేదని నిష్ఠూరంగా రాసింది. అతను ఉత్తరాన్ని కసిగా చింపేశాడు.

తను వెళ్ళి ఆ కులటనూ, ఎవడితో కన్న బిడ్డనూ ఇంటికి తీసుకురావాలా?

ఒకవేళ నిజంగానే ఏడో నెలలో పుట్టిందేమో?

మరి అబద్ధం చెప్పి పెళ్ళిచెయ్యాల్సిన అవసరం ఏమొచ్చింది. తనైనా పెళ్ళయాక ఎందుకు చెప్పలేదూ?

ఇలా ఒక వైపు మథనపడుతూనే ఉన్నాడు.

భార్యను వదిలేస్తే అందరూ ఏమనుకుంటారు? ఇక ఆఫీసులో తనకు గౌరవం ఉంటుందా? పిచ్చిపుల్లాయి కింద కట్టెయ్యరూ? తనకు బోలెడంత జీవితం ఉన్నది. మళ్ళీ పెళ్ళిచేసుకోవడం అంత సాధ్యమా?

విడాకులు ఇవ్వాలి. కాని ఆమె చరిత్ర మంచిది కాదని కోర్టులో నిర్ధారణ చెయ్యడానికి తనకు రుజువేముంది?

"ఒరేయ్ రామనాథం!"

ఆలోచిస్తూ నడుస్తున్న రామనాథం కాళ్ళు యాంత్రికంగా ఆగిపోయాయి.

"నన్ను గుర్తుపట్టలేదా?" పక్కగా వచ్చి ఆగిఉన్న కార్లో నుంచి ఓ యువకుడు దిగాడు.

రామనాథం కళ్ళు పెద్దవిచేసుకొని చూశాడు.

"నేనేరా! గుర్తుపట్టలేదూ? రాజును!"

"రాజూ నువ్వా?" ఆనందంగా అరిచినంత పనిచేశాడు రామనాథం.

రాజారావూ, రామనాథం ఒకటో క్లాసు నుంచీ పది వరకు కలిసి చదువుకున్నారు. రాజారావు సంపన్న కుటుంబంలో పుట్టాడు. పై చదువులు చదివాడు. ఫారెన్ కూడా వెళ్ళాడని తెలిసింది. కాని అనుకోకుండా ఇలా హైదరాబాదులో కన్పిస్తాడని అనుకోలేదు.

"రా! కారెక్కు. ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం!" అన్నాడు రాజు.

ఇద్దరూ కార్లో వెనక సీట్లో కూర్చున్నారు.

"ఎంత కాలానికి కనిపించావురా? ఎక్కడుంటున్నావ్


**BUILDERS' CHOICE**

# CHARMINAR

**AC Corrugated Sheets**

*Our product range:*

- 'Newkor' AC Corrugated Sheets
- Flex-O-board (Autoclaved AC Plain Sheets)
- AC Pressure Pipes for water supply and distribution
- Cable Ducts
- Asbestos Millboard
- Hysil (Thermal Insulation Blocks)

**HYDERABAD ASBESTOS**
**CEMENT PRODUCTS LIMITED**
Sanatnagar, Hyderabad 500 018 India.
Factories at: Hyderabad AP and Ballabgarh Haryana

**India's largest sellers and exporters of Asbestos Cement Products**

ఏం చేస్తున్నావ్ ? మీ నాన్న ఎక్కడ ? మీ తమ్ముడు ఏం చేస్తున్నాడు ?" గుక్క తిప్పుకోకుండా ప్రశ్నలు వేశాడు.

రామనాథం అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్పాడు.

"పెళ్ళిచేసుకున్నావా."

"ఆఁ".

"పిల్ల లెంతమంది ?"

"లేరు." గబుక్కున అనేశాడు.

"ఎంత కాలం అయింది పెళ్ళయి ?"

"పదిహేను నెలలు."

"అంతేనా ? మీ ఆవిడ ఎక్కడుంది ?"

"పుట్టింట్లో ఉన్నది. రెండు మూడు రోజుల్లో రావచ్చు. అది సరే నువ్వేం చేస్తున్నావ్ ?" సంభాషణ మరో మలుపుకు తిప్పుతూ అడిగాడు రామనాథం.

"లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్నాను. నారాయణగూడాలో ఇల్లు కట్టుకున్నాను. ఇద్దరు మగపిల్లలు."

ఒకేసారి అన్ని విషయాలూ చెప్పేశాడు రాజారావు.

"నువ్వెక్కడ ఉంటున్నావ్ ?"

"సనత్‌నగర్‌లో !"

అంతలో కారు వచ్చి ఒక పెద్ద బంగళాముందు ఆగింది.

"చాలా పెద్ద ఇల్లే కట్టావే ?"

"అంతా నా సంపాదన కాదులే. మా మామగారు కట్టించి ఇచ్చారు. బాగా ఉన్నవాళ్ళు, ఒకే కూతురు." అన్నాడు.

"అదృష్టవంతుడివి."

"నీకు మాత్రం ఏమోయ్ ! అదృష్టం అంటే డబ్బు ఉండటమేనా ?" అంటూ లోపలకు దారితీశాడు.

హాల్లో అడుగుపెట్టిన రామనాథం ఎక్కడ కూర్చోవాలో తోచనట్టు నిల్చున్నాడు.

"కూర్చోవోయ్ !"

రామనాథం సోఫాలో కూర్చున్నాడు. రాజు లోపలకు వెళ్లాడు.

ఆ హాల్లో ఉన్న ఫర్నిచర్ ఖరీదు అంచనావేస్తూ కూర్చున్నాడు రామనాథం. అతనికి అక్కడ కూర్చోవాలంటే ఎలాగో ఉన్నది. తనకు సంబంధించని ప్రపంచంలోకి వచ్చినట్టుంది. అంత విశాలమైన హాల్లో అతనికి ఊపిరి సలపనట్టుగా ఉంది.

రాజు బయటికి వచ్చి కూర్చున్నాడు.

బేరర్ కూల్ డ్రింక్స్ ఉన్న ట్రే పట్టుకొని వచ్చాడు.

"తీసుకోవోయ్ !"

రామనాథం ఒక గ్లాసు అందుకున్నాడు. సిప్‌చేస్తూ గోడలమీద ఉన్న ఫోటోలను చూడసాగాడు.

*With Best compliments from :*

**BATCHU LINGIAH & SONS**

**PAPER MERCHANTS**

GENERAL BAZAR, SECUNDERABAD-500 003.

Grams : "NEWSPRINT" Phone : 72997

"నా భార్య రమ!" తెల్లగా కొంచెం బొద్దుగా అప్పుడే హాల్లోకి ప్రవేశించిన స్త్రీని పరిచయం చేశాడు రాజు.

"నమస్కారం" అన్నాడు రామనాధం.

"నమస్కారం. మీరు మా వారికి చిన్నప్పటి స్నేహితులటగా? మీరిద్దరూ కలసి చేసిన అల్లర్లు ఎప్పుడూ చెబుతుంటారు." ఎంతో పరిచయం ఉన్నట్టుగా అన్నది ఆమె.

రామనాధానికి ముఖం ఎలా పెట్టుకోవాలో తెలియలేదు. ఒక వెధవ నవ్వు నవ్వాడు. నెర్వస్‌గా ఫీలవుతున్నాడు.

"వీడు రాత్రికి ఇక్కడే భోజనం చేస్తాడు రమా!"

"వద్దు! వద్దు! నాకు అర్జంటు పని ఉంది. మరోసారి వస్తాను." అన్నాడు రామనాధం.

"మొహమాటపడుతున్నావా?"

"అబ్బే అదేం లేదు."

"అయితే మరోసారి తప్పక రావాలి. మీ శ్రీమతిని కూడా తీసుకురావాలి," అన్నది రమ చొరవగా.

"అలాగే!"

అంతలో ఇద్దరు మగపిల్లలు లోపల నుంచి పరిగెత్తుకొచ్చి తల్లిని చుట్టుకున్నారు.

"ఒరే! నీ జిడ్డుచెయ్యి నా చీరకు పూస్తున్నావ్! పద చేతులు కడుగుతాను," అంటూ చిన్నవాణ్ణి తీసుకొని లోపలకు వెళ్ళింది రమ.

పెద్దవాడు తండ్రి దగ్గరకు వచ్చాడు.

"వీళ్ళ అల్లరి భరించలేకుండా ఉన్నాం."

"ఎన్నేళ్ళు?" ఏదో అడగాలన్నట్టు అడిగాడు.

"ఐదు. వాడికి మూడు."

"ఆడపిల్లలు లేరా?"

"అదొక్కటే మాకు పెద్ద లోటు. నా భార్యకు ఆడపిల్లలంటే తగని ప్రేమ. రెండోవాడు పుట్టినప్పుడు ఆడపిల్లకాదని రెండురోజులు వాడికేసి చూడలేదంటే నమ్ము!"

"అప్పుడే ఏం మునిగిపోయింది. ఆడపిల్ల ఈ సారి పుట్టకూడదా ఏం?"

"ఆ అదృష్టం మాకు లేదు. రెండో వాడు పుట్టినప్పుడు రమకు బాగా జబ్బుచేసింది. ఆపరేషన్ చెయ్యాల్సివచ్చింది. మరో కాన్పువస్తే ఆమె ప్రాణానికే హానీ అని చెప్పారు. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేశారు." అన్నాడు రాజు.

రాజు పెద్దకొడుకు పూలమీద వాలిన తూనీగల్ని చూస్తూ పూలమొక్కల దగ్గిరికు పరుగుతీశాడు.

"ఇక వస్తాను."


PLEASE VISIT

# VENKATESWARA VASTRALAYAM

**FOR**

RAYMONDS, MODELLA, O. C. M., GWALIOR SUITINGS,
BINNY SUITINGS AND REPUTED MILLS SHIRTINGS.

BRINDAVAN BUILDINGS
5-8-658, NAMPALLY STATION ROAD,
ABIDS CIRCLE, HYDERABAD - 500 001

Phone: 221226

"నీ భార్యను తీసుకొని వస్తావు గదూ? మేంకూడా వస్తాం."

"అలాగే!" అంటూ బయటికి వచ్చాడు.

రాజు డ్రైవర్ని కారు తియ్యమన్నాడు.

"అబ్బే ఎందుకూ? బస్సులో వెళ్తాను."

"నా దగ్గర మొహమాట మేమిటోయ్. నువ్వు చాలా మారిపోయావు సుమా!" అన్నాడు రాజు.

సమాధానంగా చిరునవ్వు నవ్వాడు రామనాథం.

కార్లో కూర్చున్నాడు.

"అయ్యగారి స్నేహితులా బాబూ?" గేటు దాటాక డ్రైవర్ అడిగాడు.

"అవును!"

"ఎక్కడికి వెళ్ళాలి?"

"అబిడ్స్!" తన ఇల్లు డ్రైవర్ చూడటం ఇష్టంలేక అబిడ్స్‌లో దిగిపోయాడు రామనాథం.

* * *

భార్యకు రమ్మని రాయడమో తను వెళ్ళి తీసుకొని రావడమో తేల్చుకోలేకపోయాడు.

ఒకరోజు ఉదయం ఎవరో తలుపు కొడుతుంటే ఆదరా బాదరా లేచి తలుపుతీశాడు.

ఎదురుగా పొత్తిళ్లలో బిడ్డతో వసుధ, వసుధ తండ్రి నిల్చుని ఉన్నారు. రామనాథం కింకర్తవ్య విమూఢిడిలా నిల్చున్నాడు.

"ఏమిటలా గడపకు అడ్డంనిల్చున్నారు కూతురి ఇంటికి వస్తే," అన్నాడు మామగారు.

"సారీ!" అని అడ్డంతప్పుకున్నాడు.

"మీరెళ్ళి ముఖం కడుక్కోండి. నేను కాఫీ పెడతాను." నిద్ర లేచివచ్చిన ఆ ముఖాన్ని చూడలేనట్టు అన్నది వసుధ.

వసుధ పిల్లను మంచంమీద పడుకోబెట్టి కాఫీ కలిపి తెచ్చింది. అప్పటికే మామా అల్లుళ్లు మాట్లాడుకుంటున్నారు.

"ఏంబాబూ! ఒక్క ఉత్తరానికీ సమాధానం ఇవ్వలేదు."

"అదేమిటండీ ప్రతి ఉత్తరానికీ సమాధానం రాసేనే. ఆ ప్యూన్‌గాడు పోస్టుచేయలేదేమో! వెధవను ఇవ్వాళే కనుక్కుంటాను."

వసుధ మౌనంగా ఇద్దరికీ కాఫీ కప్పులు అందించింది.

"అమ్మాయి నీనుంచి కబురులేదని ఒకటే గొడవ పడిపోయింది. బాబూ! ఆరోగ్యం ఎలా ఉందో! హోటల్ భోజనం ఎంతకాలం తింటారు? వెళ్తాను, వెళ్తానని ఒకటే గొడవ. పిల్ల ఏడోనెలన పుట్టడంతో అసలు బ్రతుకుతుందనే అనుకోలేదు. చాలా బలహీనంగా ఉన్నది. అందుకే ఒక్కర్తీ ఎలా పెంచుతుందో పెద్దదిక్కు లేకుండా అని అట్టేపెట్టాం."




ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు

ఆధారపడునవి

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

**లోధ్ర**

*

గర్భపోషణకు, సుఖ ప్రసవమునకు

**గర్భ రక్షక**

*

వేవిళ్ళకు, మలబద్ధకమునకు

**మాదీఫలరసాయనం**

*

ప్రసవానంతర బలమునకు, క్షీరవృద్ధికి

**సౌభాగ్య శొంఠి**

*

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు - 600 014.

ఏజెంట్లు:

సీతారామ జనరల్ స్టోర్స్ (ఏజన్సీస్)

విజయవాడ - సికిందరాబాద్

రామనాధం మామగారి ముఖంలో పరిశీలనగా చూస్తున్నాడు. ఆ ముఖంలోగానీ, కళ్లలోగానీ నటన కన్పించలేదు.

వసుధకేసి చూశాడు. వసుధ తల వంచుకొని ఆలోచిస్తూ కాఫీ తాగుతోంది. ఆమెకు రాబోయే తుఫాన్ గురించి చూచాయగా తెలుసు. ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నది.

ఆమె చూసేసరికి రామనాధం మనసులో మళ్ళీ మధన బయలుదేరింది.

రామనాధం త్వరగా స్నానం ముగించుకొని ఆఫీసుకు బయలుదేరాడు.

"ఇంత ప్రొద్దునే వెళ్తున్నారేం? భోజనంచేసి వెళ్ళరూ?"

ఏదో అనబోయి మామగారు అక్కడికి రావడంతో "ఇవ్వాళ త్వరగా వెళ్ళాలి. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ జరుగుతూది. ఇప్పటికే ఆలస్యం అయింది." అని మామగారికేసి తిరి, "వస్తానండీ. రెండు రోజులు ఉంటారుగా?" అన్నాడు.

"లేదు బాబూ, పదిగంటల బస్సుకి వెళ్ళిపోతాను. రేపు స్కూలు ఉంది," అన్నాడు.

మరొక్క మాట మాట్లాడకుండా వెళ్ళిపోయాడు రమనాధం.

"అమ్మాయ్!"

"ఏం నాన్నా!"

"నిజం చెప్పమ్మా! ఇతను నిన్ను బాగా చూస్తున్నాడా?"

"ఆ సందేహం ఎందుకొచ్చింది నాన్నా?"

"అబ్బే ఏంలేదు! అలా అనిపించింది."

"ఆయన పైకి అలా కన్పిస్తారు కాని మనసు మంచిది."

"ఏమో తల్లీ ఇప్పటికే నీకు అన్యాయం జరిగిందనే అనుకుంటున్నాను. పిల్లను ఒక్కసారి కూడా అతను కన్నెత్తి చూడలేదు."

"మీ రున్నారని సిగ్గుపడి ఉంటారు. ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం."

"ఈ ఆర్థిక వ్యవస్థలో కట్నాలు గుమ్మరించలేని ఇళ్లల్లో పుట్టిన ఆడపిల్లలు సుఖపడరు తల్లీ!" అతని కంఠం వణికింది.

"నాకేం నాన్నా నేను చాలా సుఖంగా ఉన్నాను." పొంగుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అనేసి వంటింటిలోకి వెళ్ళిపోయింది.

తండ్రి భోజనంచేసి బయలుదేరాడు.

కూతురు గడపవరకూ వచ్చి సాగనంపింది తండ్రిని కన్నీటితో.

పిల్లకు స్నానం చేయించింది. కొత్త గౌను తొడిగింది.

*With Best Compliments from :*

**INDIA BLOCK MAKERS**

VIJAYAWADA - 520003

Phone : 72295

బుగ్గమీద దిష్టిచుక్క పెట్టింది. బోసినవ్వులు వెదజల్లుతున్న ముఖాన్ని ముద్దుపెట్టుకుంది. పాలు పట్టి నిద్రపుచ్చింది.

అన్నం దగ్గర కూర్చున్నదే కాని తినబుద్ధి పుట్టలేదు.

భర్త ఉత్తరాలకు సమాధానాలు ఇవ్వానని బొంకాడని ఆమెకు అర్థం అయింది.

ఆమె మనసు తుఫాన్ రాబోయేముందు ఉండే ఆకాశంలా ఉన్నది.

సాయంత్రం భర్త వచ్చేసరికి ఇస్త్రీ వాయల్ చీరకట్టుకొని ఎదురుచూస్తూ కూర్చుంది వసుధ.

రామనాథం వచ్చాడు.

ముభావంగా భార్య ఇచ్చిన కాఫీ తాగాడు.

వసుధ పిల్లను ఎత్తుకొచ్చి "ఎత్తుకోండి. పాపాయికేసి కూడా ఇంతవరకూ చూడలేదు," అన్నది.

రామనాథం కన్నెత్తి చూడలేదు. బట్టలు మార్చుకోవడానికి వెళ్ళాడు. భర్త వాలకం ఆమెకు అర్థంకాలేదు.

"ఏమిటండీ అలా ఉన్నారు."

"ఎలా ఉన్నాను ?"

"కనీసం ఒక ఉత్తరమైనా రాయలేదు. పాపను చూడటనికి రాలేదు. వచ్చాక కన్నెత్తి చూడలేదు."

"దాని తండ్రి ఎవరు ?"

ఉరుములేని పిడుగు నెత్తిన పడినట్టయింది వసుధకు.

భర్త ముఖంలోకి వెర్రిచూపులు చూసింది.

"ఏమిటలా చూస్తావ్ ! చెప్పు ! మన పెళ్ళయిన ఎన్నెల్లకు దీన్ని కన్నావ్? ఇప్పుడు అర్థం అయింది నువ్వు బి. ఏ. చదివినట్టు దాచడానికి కారణం. యస్.యస్.ఎల్.సి. వాడికిచ్చి హడావిడిగా మీ నాన్న ఎందుకు పెళ్లి చేసినట్టు ఎవడితోనో ప్రేమకలాపం సాగించావ్ . కడుపు వచ్చింది. పెళ్ళయిన ఎనిమిది నెలల్లోపే పిల్లను కన్నావ్. ఏడో నెల్లో బిడ్డ పుట్టినట్టు నాటకం ఆడారు మీరందరూ కలిసి. నన్ను పిచ్చిపుల్లాయి కింద కట్టేశారు." బుసలుకొడ్తున్నాడు రామనాథం.

ఎదురుగా పడగ విప్పిన కాలసర్పాన్ని చూస్తున్నట్లు నిలబడిపోయింది వసుధ.

"మాట్లాడవేం ?" గద్దించాడు.

వసుధ తేరుకోలేదు. షాక్ తిన్నట్టు నిల్చుంది.


# ANDHRA PRADESH STATE FILM DEVELOPMENT CORPN. LTD.

( A STATE GOVERNMENT UNDERTAKING )

"GRUHAKALPA", M. J. ROAD, HYDERABAD-500 001.

*Giving Fillip for Development of Film Industry in Andhra Pradesh*

**Loans for Construction of Cinema Halls**

Loans are restricted for towns/villages with a population of 50,000 and below

Total outlay not to exceed Rs. 6 lakhs

Loan upto Rs. 3 lakhs or 2/3 whichever is less

**Progress as on 1-7-1980**

Loans sanctioned for construction of 93 Cinema Halls: Rs. 2.18 Crores

Number of Cinema Halls commenced business : 78

**Loans for Construction of Film Studios, Laboratories etc.**

Loan assistance upto 70% to 80% of the cost of the project

Loans sanctioned to 5 Film Studios : Rs. 75.09

**Documentary and Newsreels**

Number of Documentaries and Newsreels produced : 16

Number of Documentaries and Newsreels under production : 11

Number of Documentaries and Newsreels supplied to A. P. Government Depts. : 69

*And many more other activities for the growth of Film Industry in Andhra Pradesh*

*Managing Director*

"ఏమిటే అలా నిల్చున్నావ్? నీ గుట్టు బయటపడిందనేగా? కులటా!"

వసుధ ఒక్కసారి షాక్‌నుంచి బయటపడింది.

"ఏమన్నారూ! కులటా? నేను కులటనా? మీకు మతిపోయింది. మొదటినుంచీ మీరు అనుమానిస్తూనే ఉన్నారు. మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. మళ్లీ ఆ మాట అనండి...."

"ఏం చేస్తావేం?"

"ఏం చేస్తానో మీరే చూస్తారు. మళ్లీ మీ ముఖం చూడను. ఛ! ఇంతకాలం అయినా మీరు నన్ను అర్థంచేసుకోలేదు. కావాలంటే వెళ్ళి పాప పుట్టిన ఆసుపత్రిలో ఎన్‌క్వయిరీ చెయ్యండి. అంతేగానిపిచ్చిపిచ్చిగా మాట్లాడకండి."

"ఏమన్నావ్? నేను పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నానా?"

"అవును! మీకు ఇష్టంలేకపోతే, నా మీద నమ్మకం లేకపోతే ఒక్కమాట నన్ను వెళ్ళిపొమ్మని చెప్పండి. మళ్ళీ ఈ గడప తొక్కను."

"ఓహో! బి. ఏ. చదువుకున్నదానివి కదూ? అందుకే బెదిరిస్తున్నావా?"

"నేను బి. ఏ. చదవలేదు. ఆ విషయం మర్చిపోయి చాలా కాలం అయింది. ఇప్పుడు నేను కేవలం మీ భార్యను మాత్రమే."

రామనాథం ఆలోచనలో పడ్డాడు.

వసుధకు అభిమానం ఎక్కువ. వెళ్ళిపోతుందేమో? ఒకవేళ తనే పొరపాటు పడుతున్నాడేమో! ఆమె చెప్పేదే నిజం కావచ్చును.

రామనాథం లేచి బయటికి వెళ్ళాడు. తిరిగి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు.

వసుధ తలుపు తీసింది.

ఒక్క ప్రశ్నకూడా వెయ్యలేదు. పిల్ల దగ్గరకెళ్ళి పడుకుంది.

రెండో రోజు రామనాథం ప్రశాంతంగానే కన్పించాడు.

వసుధ భోజనానికి పిలవడానికి వచ్చింది. రామనాథం నిద్రపోతున్న పిల్ల ముఖంలోకి చూస్తూ కూర్చుని ఉన్నాడు. అతనికి బిడ్డను చేతుల్లోకి తీసుకోవాలనిపించింది.

భార్యను చూసి తప్పుచేస్తున్నట్లు లేచి వంటింట్లోకి వెళ్ళాడు.

నెల రోజులు గడిచాయి.

భార్యాభర్తలు ముభావంగా ఉంటున్నారు.

పిల్లను చూస్తుంటే రామనాథం మనసులో ఏదో తొలుస్తున్నట్టు ఉంటుంది.

పిల్ల ఏడుస్తుంటే గొంతు పిసకాలనిపిస్తుంది.


***With Best Compliments from***

Grams : ASPHALT

**Phones : 4202/4203/5679**

Telex : 0465 - 252

# ANDHRA ASPHALT PRIVATE LTD.,

**10-1-32, Waltair Uplands,**
**VISAKHAPATNAM - 3**

**Manufacturere of**

All Gredes of Industrial Asphalt Based Products
Roofing Felt of all grades as per IS : Specification.

**Factory :**

Malkapuram,
**Visakhapatnam - 11**
Phone : 7344

**Branches :**
Hyderabad & Madras

పిల్ల బోసినవ్వుల్లో నుంచి నిప్పుకణాలు రాలుతున్నట్టు మనసు భగ్గున మండుతున్నది.

ఈ పిల్ల ఈ ఇంట్లో ఉండటానికి వీల్లేదు. అది ఉంటే తనకు మనశ్శాంతి లేదు. తను ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి?

రామానాథం ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఆ సాయంత్రం పిల్లకు గౌనులు తెచ్చాడు.

వసుధ ఆనందానికి అంతులేదు.

పిల్లను ముద్దులాడాడు.

ఆ పిల్లే తన ప్రాణంగా భావిస్తున్నట్టు వసుధ ముందు నాటకం ఆడసాగాడు.

వసుధ మనసు కుదుటపడింది.

పిల్ల ఏడుస్తుంటే వసుధను కోపగించుకొనేవాడు. "పిల్ల కంటే ఆ పని ఎక్కువా?" అని విసుక్కొనేవాడు.

పిల్లనూ భార్యనూ తీసుకొని రెండు మూడు సార్లు సినీమాలకు వెళ్ళాడు.

వసుధకు మళ్ళీ నెల తప్పింది. నలతగా ఉన్నది. ఆ రోజు జ్వరం వచ్చింది. డాక్టర్ను తీసుకొచ్చాడు. మందులు రాసిచ్చారు. మందులు కొనక్కొని రావడానికి బయలుదేరాడు. పిల్లను కూడా ఎ కున్నాడు.

"దాన్ని ఇప్పుడు బజారు కెందుకు?" అన్నది వసుధ.

"నువ్వు లేవలేకుండా ఉన్నావ్! అది ఇప్పుడే నిద్ర పోదు. కాస్త అలా తిప్పుకొస్తాను," అంటూ వెళ్ళిపోయాడు.

రాత్రి పన్నెండయినా భర్త రాలేదు.

పిల్లను కూడా తీసుకెళ్ళాడు.

వసుధకు ఆత్రుతగా ఉంది. జ్వరంలోనే ఇంట్లోకీ బయటికీ తిరగసాగింది. ఎన్నో అనుమానాలు మనసును చుట్టేస్తున్నాయి. మనసు ఏదో కీడును శంకిస్తున్నది.

దాదాపు వంటి గంట ప్రాంతంలో భర్త తలుపుకొట్టాడు. పరుగున వచ్చి తలుపు తీసింది వసుధ.

రామనాథం, మరో వ్యక్తీ నిలబడి ఉన్నారు.

"పాప ఏదీ?"

రామనాథం తల వంచుకున్నాడు.

"వీరు మా మందుల షాపులో మందులకు వచ్చారండీ. ఆ సమయంలో రద్దీగా ఉన్నది. ఆయన పిల్లను దించి మందులు తీసుకున్నారు. డబ్బు చెల్లించి చూస్తే పాప కన్పించలేదు. అందరం వెదికాం. చివరకు పోలీసు కంప్లైంటు ఇచ్చి వస్తున్నాం. ఆయన వాలకం చూసి మాకు భయంవేసింది. పిల్ల లేకుండా ఇంటికి ఎలా వెళ్ళడం


With Best Compliments From:

P. J. APPALANARASAYYA & SONS

&

PEEJAY ENTERPRISES

PAINTS DEALERS

VISAKHAPATNAM

Phone No : 2145 ; 5913 ; 3509

అంటూ పసిపిల్లవాడిలా ఏడ్చాడు. ఈయన అఘాయిత్యం ఏదైనా చేస్తారని మాకు భయంవేసింది. మా యజమాని కారు ఇచ్చి ఈయనను ఇంటిదగ్గర దిగబెట్టమంటే వచ్చాను."

"అన్నీ అబద్ధాలు. నా పిల్లను మీరే ఏదో చేశారు? ఏం చేశారు చెప్పండి." చిరుతపులిలా భర్తమీదకు దూకింది. ఆయన షర్టు పట్టుకొని పిచ్చిదానిలా లాగింది. అది సర్రున చిరిగింది.

"నిజం అమ్మా! ఆయన ఏంచెయ్యలేదు. మీరు శాంతించాలి. అసలే ఆయన కృంగిపోతున్నారు. మీ పిల్ల తప్పక దొరుకుతుంది. పోలీసు రిపోర్టుకూడా ఇచ్చాం," అన్నాడు రామనాథంతో వచ్చిన వ్యక్తి.

రామనాథం తల వంచుకొని అలాగే అపరాధిలా నిల్చున్నాడు.

వసుధ పిచ్చిగా తల బాదుకుంటూ ఏడవసాగింది. వసుధ దాదాపు మంచంపట్టింది. రామనాథం ఇచ్చిన టెలిగ్రాం అందుకొని తల్లీ దండ్రీ వచ్చారు. రామనాథంకూడా కుమిలిపోతున్నాడు. తండ్రి కూతుర్ని అనేక విధాల బుజ్జగించి తల్లిని కొంతకాలం ఉండమని వెళ్ళిపోయాడు.

వసుధ దాదాపు మంచంపట్టింది.

ఏరోజుకు ఆరోజే పోలీసుస్టేషన్‌కు వెళ్ళివస్తున్నాడు రామనాథం.

"వసూ!"

నీరసంగా భర్త ముఖంలోకి చూసింది.

"నీ విషయంలో నన్ను అనుమానిస్తున్నావా? నేను అంత దుర్మార్గుడినా?" రెండు చేతులతో ముఖం కప్పుకొని కుమిలి కుమిలి ఏడవసాగాడు.

"నా దురదృష్టం...."

"మన దురదృష్టం అను. నువ్వు ధైర్యం తెచ్చుకొని తిరగాలి. నువ్వుకూడా నన్ను వదిలి వెళ్ళిపోతావా? మన అమ్మాయి తప్పక దొరుకుతుందని ఇన్‌స్పెక్టర్ చెప్పాడు. నువ్వు వట్టిమనిషివి కూడా కాదు. పుట్టబోయే బిడ్డకోసమైనా నువ్వు ధైర్యం తెచ్చుకొని తిరగాలి. తినాలి."

"నిజంగా మన బిడ్డ దొరుకుతుందా?"

"దొరుకుతుంది. తప్పక దొరుకుతుంది. ఆ ఇన్‌స్పెక్టర్ చెప్పాడు. ఏడాది తర్వాత ఒక మార్వాడీ కొడుకును పిల్లల్ని ఎత్తుకుపోయే ఒక ముసలమ్మ దగ్గిర పట్టుకున్నారట."

వసుధ గాజుకళ్ళలా ఉన్న కళ్ళలో ఓ మెరుపుతీగలా క్షణం కదిలి ఆరిపోయింది.

వసుధ పిల్లను తల్చుకొని ఏడవ రోజు లేదు.

*With Best Compliments Of*

Grams : PLASTIKA

Phone Office : 8121
Factory : 2205

**Plastika Industries**

C 23, Industrial Estate
VISAKHAPATNAM - 530 007.

M F G S : Fishing Twine, Ropes, Box Strapping and Allied Products

ఈ సారి తొమ్మిదోనెల మళ్ళీ ఆడపిల్లే పుట్టింది. రామనాథం పురిటికి పుట్టింటికి పంపించనన్నాడు. వసుధ తల్లి వచ్చి పురుడుపోసింది.

* * *

కాలం ఎటువంటి గాయాన్నయినా మాన్పుతుంది. కాని దాని తాలుకు మచ్చ మాత్రం మిగిలిపోతుంది. అది అప్పుడప్పుడు గతాన్ని గుర్తుకు తెస్తుంది.

కాలగర్భంలో పద్దెనిమిది సంవత్సరాలు గడిచిపోయాయి.

వసుధకు ఇద్దరు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూ కలిగారు.

రామనాధానికి ఫ్యామిలీ ప్లానింగ్ మీద నమ్మకం లేదు.

వసుధ జీవితంతో రామనాధంతో పెళ్లికి అంగీకరించిన నాడే రాజీపడిపోయింది. బి. ఏ. డిగ్రీ చింపేసిన క్షణంలోనే తనకూ ఓ వ్యక్తిత్వం ఉన్నదనే విషయాన్ని పూడ్చిపెట్టింది. అప్పుడప్పుడు ఆమె అభిమానం తల ఎత్తడానికి ప్రయత్నించినా, ఆమెలోని వివేకం మొట్టికాయ వేసేది. భర్తకు ఫ్యామిలీ ప్లానింగ్‌మీద నమ్మకం లేదు. తను తలవంచింది. ఆమె మానసికంగా చిన్ననాడే అలసిపోయింది. శక్తిని కూడదీసికొని అన్యాయాన్ని ఎదిరించాలనే ప్రయత్నం ఏనాడు చెయ్యలేదు.

ఆడపిల్ల పెద్దది ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. రెండోవాడు ఇంటర్ మొదటిసంవత్సరంలో ఉన్నాడు. మిగతా ముగ్గురూ ఇంకా స్కూలు చదువులోనే ఉన్నారు.

ఇంతమంది ఉన్నా పోయిన బిడ్డను చాలా అరుదుగా దొరికే తీరికసమయాల్లో తలచుకొని బాధపడుతూ ఉంటుంది. భర్తముందు ఆ విషయం ఎత్తి కొన్ని సంవత్సరాలు అయింది.

పెద్దకూతురికి కాలేజీ చదువు చెప్పించవద్దని భర్తతో అన్నది. తను అలా అన్నందుకు తనకే తనెంత మారిపోయిందో అర్థంఅయి ఆశ్చర్యపోయింది.

"అది బి.ఏ. పాసయితే, ఉద్యోగంలో పెట్టవచ్చును. మిగతావాళ్ల చదువుకు నా ఒక్కడి సంపాదనతో ముందుకు సాగడం సాధ్యంకాదు."

"అచ్చం మా నాన్నలాగే అంటున్నావ్!" అనాలనుకుంది. విరక్తిగా ఓ చిరునవ్వు మాత్రం నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్? మీ నాన్నలా నా కూతుర్ని కాలేజీలో చదవలేదని ఓ గుమస్తాకు ఇచ్చి చెయ్యనులే. మీ నాన్న పల్లెటూరి బడిపంతులు. కాని నాకు కాస్త పరపతి ఉన్నది. తేలిగ్గా ఉద్యోగం ఇప్పించుకోగలను నా కూతురికి." నవ్వుతూ అన్నాడు రామనాథం.

*With Best Compliments from*

**BHAGYANAGAR ICE FACTORY**

**KUKATPALY**

**Rangareddy District**

Andhra Pradesh

“చచ్చిన పామును మళ్లీ మళ్లీ ఎందుకు చంపుతారు?”

“ఛ! అవేం మాటలు వసూ! సర్దాగా అన్నాను.” నొచ్చుకుంటూ అన్నాడు రామనాథం.

పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు తెలియలేదు.

పిల్లలు పెద్ద అవుతున్నారు. ఖర్చులు పెరిగిపోతూ ఉన్నాయి. వయసుతోపాటు పిల్లల కోరికలుకూడా పెరుగుతున్నాయి. కలలు కనే హక్కు అందరికీ ఉన్నది. కాని ఆ కలల్ని వాస్తవాలుగా మార్చుకోగల స్తోమత ఈ సమాజంలో కొందరికే ఉందని తెలుసుకోలేని వయసు వాళ్ళది.

ఇది కావాలి, అదికావా లంటారు.

పెద్దకూతురు సహజ మరీ! ఆ అమ్మాయికి ఎప్పుడూ మంచిబట్టలు వేసుకోవాలనీ, చక్కగా ముస్తాబవాలనీ ఉంటుంది. చదువుమీద పెద్దగా శ్రద్ధలేదు.

ఆడపిల్లలు కాలేజీలో చదివారంటేనే చిన్నచూపు చూసేవాడు ఒకప్పుడు వసుధ భర్త. ఇప్పుడు కూతుర్ని చదివిస్తున్నాడు. పైగా తన కూతురు అందగా ఉంటుందని మహా గర్వం. ఈ విషయం తలచుకుంటూ వసుధ ఎన్నోసార్లు తనలో తనే నవ్వుకున్నది.

“అమ్మా రేపే పరీక్షఫీజు కట్టడానికి ఆఖరురోజు” సహజ.

“డాడీ! మా కాలేజీ క్లాస్‌మేట్స్ అందరూ నాగార్జునసాగర్ డాంకు వెళ్తున్నారు. కనీసం ఏభై రూపాయలన్నా కావాలి.” పెద్ద కొడుకు రఘు.

“డాడీ! నాకు పండక్కి కొత్తబట్టలు కుట్టించవూ? మాధవి పరికిణీలాంటిది- పట్టుది- నీలంది- జరీపువ్వులది.... పెద్దజరీ అంచు.... మరింకేమో అలాంటిదే పువ్వుల్లేకుండా జాకెట్.... కుట్టిస్తావు గదూ?” తండ్రి ఒళ్లోకి ఎగబాకుతూ చిన్నకూతురు కవిత.

అందరి కోరికలూ తీరుస్తామని ప్రామిస్ చెయ్యడం. లేకపోతే ఆ క్షణం ఊపిరి పీల్చుకోనివ్వరు.

వసుధకు ఇంటిచాకిరీ ఎక్కువైంది. భర్తకు తెలియకుండా అప్పడాలూ, వడియాలూచేసి ఇరుగుపొరుగు వాళ్ళకు అమ్మేది. వసుధ చిరుగుపట్టని చీరకట్టుకొని దాదాపు ఐదేళ్లయినా అయి ఉంటుంది.

వసుధకు పిల్లలంటే ప్రాణం.

ఎలాగయినా వాళ్లు కష్టపడకూడదనే తాపత్రయం ఆమెది.

ఆమె భర్త కూడా దమ్మిడీ బయట ఖర్చుచెయ్యడు. మొత్తం తెచ్చి భార్యచేతిలో పోస్తాడు. ‘సంసార సాగరం నువ్వే ఈదు- నా వల్లకాదు’ అన్నట్టు అంటీ అంటకుండా ఉంటాడు.

వసుధను గౌరవిస్తాడు. వయసు పెరిగినకొద్దీ ఆ ఇంట్లో

*With Best Compliments of*

Phone: 677

# JAYA FINANCE COMPANY

**(AUTO FINANCIERS)**

**CHIRALA**

వసుధదే పైచేయిగా ఉన్నది. ఏంచేసినా ఆమె సలహాతోనే చేస్తాడు రామనాథం.

వాళ్ల సంసారం చిల్లుపడ్డ నావ. ఆ నావ మునిగిపోకుండా ఒడ్డుకు చేర్చాల్సిన బాధ్యత వాళ్ళది. అంతే! వాళ్లకు తమదైన జీవితం ఒకటి ఉన్నదనే విషయం మర్చిపోయి చాలా కాలం అయింది.

* * *

సాయంత్రం ఏడైంది. ఎండ తగ్గినా వేడిగాలులు వీస్తూనే ఉన్నాయి.

ఎవరో తలుపు కొడ్తున్నారు.

చిన్న కూతురికి జడవేస్తూ "ఒరే రామూ! ఎవరో చూడరా" అంటూ వసుధ రెండో కొడుకుని కేకపెట్టింది.

సినిమా బొమ్మలు చూస్తున్న రాము పత్రికలోనుంచి తలెత్తలేదు."

మళ్లీ తలుపుమీద దడదడా శబ్దం.

వసుధ విసుగ్గా లేచి వెళ్ళి తలుపుతీసింది.

ఎదురుగా ఆఫీస్ బోయ్ చెమట్లు కక్కుతూ రొప్పుతూ నిల్చుని ఉన్నాడు. అతను అప్పుడప్పుడు క్యారియర్ తీసు కెళ్ళడానికి వస్తూ ఉండేవాడు.

"ఏమిటి రామూ? ఈ వేళప్పుడొచ్చావ్!"

వాడి కళ్ళు ఎర్రగా ఉన్నాయి. కళ్ళు తుడుచుకున్నాడు.

"ఏమిటి? ఏమైంది?"

నోరు తెరిచి ఏదో చెప్పబోయి తిరిగి ఆగిపోయాడు.

వసుధ గాభరాపడింది.

"ఏమైంది? ఆయన ఇంకా ఇంటికి రాలేదేం?"

"అమ్మా!" భోరుమన్నాడు.

"ఏమిటి? ఆయనకు ఏమీ ప్రమాదం జరుగలేదుకదా?" ఆతృతగా అడిగింది.

"అయ్యగార్ని లారీ గుద్దేసిందమ్మా! గాంధీ ఆసుపత్రిలో ఉన్నారు."

వసుధ పడబోయి ద్వారబంధం పట్టుకుంది.

అయోమయంగా నిల్చుంది.

"ఆఫీసరుగారు కారు పంపించారు. త్వరగా బయలు దేరండమ్మా!"

అంతవరకూ వసుధ రోడ్డుమీద ఉన్న కారు చూడలేదు.

ఆమె విన్నది ఏమిటో ఆమెకు బోధపడనట్టు నిల్చుంది.

"అమ్మా!"

"అమ్మా!" అప్పుడే వచ్చిన పెద్దకూతురు పిల్చింది.

కూతుర్ని కావిలించుకొని ఒక్కసారిగా బావురుమన్నది వసుధ.

With Best Compliments

BUYWEL CORPORATION

Annapurna Hotel Buldings,
Nampalli Station Road,
HYDERABAD 500 001. Phone No. 44691

Dealers :

Dynora TV, Allwyn Refregirators, Philips Radio & Tape Recorders

"రఘూ !" గావుకేక పెట్టింది సహజ.

చదువుతున్న పుస్తకం మడిచి రఘు పరుగులాంటి నడకతో పరిగెత్తుకొచ్చాడు.

అప్పటికే వసుధ కుప్పలా కూలిపోయి వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"ఏమిటి ? ఏమైంది ?"

రఘు ప్రశ్నకు రాము జరిగింది చెప్పాడు.

"త్వరగా బయలుదేరాలి బాబూ !"

వసుధ ఏడుపు విని ఎదురింటి కమలమ్మ పరిగెత్తుకొచ్చింది.

ఆమె వసుధను కార్లో కూర్చోబెట్టి తనూ కూర్చుంది.

పిల్లలంతా వచ్చి కూర్చున్నారు.

కారు ఆసుపత్రి గేటుముందు ఆగింది. అందరూ ఏడుస్తున్నారు.

"ఉష్ ! ఇది ఆసుపత్రి. ఏడవకూడదు." ఒక నర్స్ హెచ్చరించింది.

"ఏడుపు ఆసుపత్రిలోవస్తే ఇంటికివెళ్ళి ఏడవమంటావా?" అనాలనుకుంది కమల.

చిన్నపిల్లల్ని కార్లోనే ఉంచాడు డ్రైవర్.

అందరూ లోపలకు వెళ్లారు.

వంటినిండా కట్లతో భయంకరంగా మంచంమీద పడి ఉన్నాడు రామనాథం.

వసుధ ఒక్కసారిగా బావురుమన్నది. సహజ వరండాలోకి వెళ్ళి వెక్కి వెక్కి ఏడవసాగింది. రఘు వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుకుంటున్నాడు.

మంచం దగ్గర ఎవరో ఆఫీసువాళ్ళున్నారు.

ఏదేదో అంటున్నారు.

డాక్టర్ వచ్చాడు. ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు.

అర్ధగంటతర్వాత కళ్ళుతెరిచి వసుధను చూశాడు. సైగతో దగ్గరకు పిలిచాడు. నోటిలో పైట కుక్కుకుని దుఃఖం ఆపుకుంటూ తల దగ్గరగా వెళ్ళి నిల్చుంది. అందరికేసే చూశాడు.

నర్స్ అందర్నీ బయటకు వెళ్ళమన్నది.

"వ....వసూ.... నన్ను క్షమించు. ఒక మాట చెప్పు, నిజం చెబుతావా ?"

ఆమె తల ఊపింది. "ఇప్పుడు .... కూడా అబద్ధం చెబుతానా?" ఎలాగో పెగల్చుకొని అన్నది.

"మన మొదటిబిడ్డ ఎవరి బిడ్డ ?"

"మీ బిడ్డేనండీ ! నేను నిజం చెబుతున్నాను." వెక్కి వెక్కి సన్నగా ఏడుస్తూ అన్నది.

*With Best Compliments from*

# Deepak Enterprises

MAHATHMA GANDHI ROAD,

SECUNDERABAD

Phone : P. P. 7 3 2 5 1

"నేను పాపిని వసూ! నీలాంటి భార్యను శంకించాను. అందుకే...."

"ఇప్పుడేమీ అలాంటి మాటలు అనకండి."

"ఆ పిల్ల.... ఆ పిల్ల.... నారాయణగూడాలో రాజారావు అనే జడ్జీగారింట్లో పెరు....గుతోంది...." ఆపైన మాట్లాడ లేనట్టు కళ్ళు మూసుకున్నాడు.

డాక్టర్ వచ్చాడు. నాడి చూసి తెల్లదుప్పటి కప్పేశాడు.

వసుధ ఒక్కసారిగా ఘొల్లుమన్నది. అందరూ పరిగెత్తు కొచ్చారు.

* * *

కర్మకాండ జరిగిపోయింది. అప్పటికే వసుధ తల్లీ దండ్రి పోయారు. అన్న అమెరికాలో ఉన్నాడు. తమ్ముడూ, చెల్లెలూ వచ్చారు.

రామనాధానికి రావాల్సిన ప్రావిడెంటుఫండూ వగైరా ఆఫీసరు ప్రత్యేకంగా ఇంట్రెస్ట్ తీసుకొని ఇప్పించాడు. ఫామిలీ పెన్షన్ వస్తోంది. వసుధ క్రమంగా కోలుకుంది.

యాంత్రికంగా ఇంటిపనులు చేస్తున్నది.

ఒక రోజు సుమతి వచ్చింది. వసుధకు భర్త పనిచేసిన ఆఫీసులో ఉద్యోగం ఇప్పిస్తానని తన భర్త చెప్పమన్నట్టు చెప్పింది. వసుధ ఆలోచించి చెబుతానన్నది.

క్రమంగా డబ్బు అయిపోయింది. వచ్చే పెన్షన్‌తో ఇల్లు సగంరోజులు గడవడంకూడా కష్టం అయిపోయింది.

ఒక రోజు వసుధ సుమతి దగ్గరకు వెళ్ళింది. తను ఉద్యోగం చేస్తానని చెప్పింది.

ఆఫీసులో వసుధకు యల్.డి.సి. గా ఉద్యోగం ఇచ్చారు.

వసుధ భర్తపోయిన షాక్‌నుంచి కొంచెం తేరుకుంది.

ఆ రోజు రాత్రి తన గతాన్ని ఆలోచిస్తూ పడుకుంది.

భర్త చనిపోతూ అన్నమాటలు గుర్తువచ్చాయి.

అవును! ఆ విషయం తను ఎలా మర్చిపోయింది? తన బిడ్డ బ్రతికే ఉంది. ఈ ఊళ్లోనే ఉన్నది. తను ఇంతవరకూ ఆ విషయం ఆలోచించనేలేదు.

ఎలా ఉందో! ఎంత ఎత్తు ఎదిగిందో? వెంటనే వెళ్ళి చూడాలనిపించింది. ఆ రాత్రంతా కలతనిద్రతోనే గడిపింది.

రెండో రోజు ఆఫీసుకు శెలవు పెట్టింది.

అడ్వకేటు రాజారావు జడ్జి అయ్యాడు.

నారాయణగూడా వెళ్ళింది. ఎవరెవర్నో అడగ్గా చివరకు జడ్జి రాజారావుగారిల్లు చేరుకోగలిగింది.

పెద్ద ఆవరణలో అధునాతనంగా ఉన్న భవంతి కన్పిస్తున్నది. గేటులో గూర్ఖా ఉన్నాడు.

తన బిడ్డ ఈ ఇంట్లో పెరుగుతోందా?


సెంట్రల్ బ్యాంకు నుండి

5 ఉపయోగకరమైన పొదుపు పథకాలు

1. రికరింగ్ డిపాజిట్ స్కీము
(పునరావర్త పెట్టుబడి పథకం)

2. మంత్లీ ఇంటరెస్ట్ డిపాజిట్ స్కీము
(నెలసరి వడ్డీ డిపాజిట్ స్కీము)

3. మనీ మల్టిప్లయర్ డిపాజిట్ స్కీము
(కొద్ది పెట్టుబడి - అధిక రాబడి)

4. ఫిక్స్‌డ్ డిపాజిట్స్
(స్థిర నిల్వలు)

5. హోమ్ సేవింగ్స్ సేఫ్ అకౌంట్
(ఇంటి పొదుపు మొత్తాల ఖాతా)

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రజలకు అనువైన చోట్లలో అందుబాటులోగల బ్యాంక్

ఎంత ముద్దుగా పెరుగుతున్నదో ?

తను వెళ్ళి తన బిడ్డ జీవితంలో.... వెనక్కి తిరిగింది.

మళ్ళీ ఆగింది.

ఒకసారి కళ్ళారా చూడాలి తన బిడ్డను ! మనసారా దీవించాలి. తను దూరంనుంచి అయినా చూడాలి. తను ఎవరని చెబుతుంది ? ఎందుకువచ్చానని చెబుతుంది ? ఎలా ఆ ఇంట్లోకి వెళ్ళడం ?

“ఏయ్ ! ఏమిటలా చూస్తావ్ ! కోన్ హోనా ?” గూర్ఖా అడిగాడు. ఆమెను దొంగను చూసినట్టు చూస్తున్నాడు.

“ఒక్కసారి అమ్మగార్ని చూడాలి.”

“ఎవరు నువ్వు ?”

ఏం చెప్పాలి ?

విమానంలాంటి కారువచ్చి గేటుముందు ఆగింది.

“ఎవరమ్మా !” తల కలగాపులగంగా నెరసిన మధ్య వయస్కుడు కార్లోనుంచి తొంగిచూస్తూ అడిగాడు.

ఆమెకు అతన్ని ఎక్కడో చూసినట్టు అన్పించింది.

అవును ! ఒకసారి తనూ, తన భర్తా సూపర్ బజార్‌కు వెళ్ళారు.

“ఏమోయ్ బాగున్నావా ? ఈ ఊళ్లోనే ఉంటున్నావా ? మళ్లీ ఇన్నేళ్లకా కనిపించేది. అప్పుడు మెరుపులాకన్పించావ్. నీ అడ్రసుకూడా ఇవ్వలేదు. కొన్నాళ్లు నీ గురించి ఆలోచించాను అఫ్‌కోర్స్ ఆ తర్వాత మర్చిపోయాననుకో.”

గబగబా అనేశాడు ఒక వ్యక్తి. అతన్ని చూడగానే ధనవంతుడని తెలిసిపోతుంది.

“ఈయన నా చిన్నప్పటి స్నేహితుడు. జడ్జి రాజారావు. ఈమె నా భార్య” పరస్పరం పరిచయం చేశాడు.

“ఓ డాడీ ?” అవతల నుంచి ఓ పదేళ్ళ పిల్లవాడు కేక పెట్టాడు.

“వస్తానోయ్ ! నీ భార్యను తీసుకొని ఒకసారి రా !” అంటూ వెళ్లిపోయాడు.

అవును ! ఆయనే ఈయన !

అంటే తన స్నేహితుడికే తన బిడ్డను పెంచుకోవడానికి ఇచ్చాడన్నమాట !

“ఏమిటమ్మా ! ఏం కావాలి ?”

“నేను.... నేను.... రామనాధం భార్యనండీ....”

“రామనాధమా! ఓ అతనా....” అంటూ ఆమె ముఖంలోకి చూసి ఆగిపోయాడు.

కారు దిగాడు. “ఎంత కాలం అయింది వాడు పోయి ?”

“ఆరు నెలలు.”

*With Best Compliments from*

# AMAR SANITARY STORES

**SANITARY ENGINEERS AND CONTRACTORS**

*Stockists*

NEYCER PRODUCTS

***Dealers in***

G. I., C. A., A. C. Pipes and Sanitary Wares etc.,

6-2-979/6, Raj Bhavan Road,
Khairatabad, Hyderabad-500 004

Phone : 32348

"అయ్యో నాకు తెలియదు. లోపలకు రండమ్మా!" అంటూ తనతో లోపలకు తీసుకెళ్ళాడు.

ఆమెను హాల్లో కూర్చోబెట్టి భార్యను పిల్చుకొనివచ్చాడు. ఆమె కూడా రామనాథం పోయినందుకు విచారాన్ని వెలిబుచ్చింది.

"ఎంత మంది పిల్లలు?"

"ఇద్దరు ఆడపిల్లలూ ముగ్గురు మగపిల్లలు....కాదు.... ముగ్గురు...." అంటూ ఆగిపోయింది. ముగ్గురు ఆడపిల్లలు అనకుండా ఇద్దరేనని చెప్పినప్పుడు ఆమె గుండెలో ఏదో గుచ్చుకున్నట్టు అయింది.

"అయ్యో! అంత మందిని ఎలా పోషిస్తున్నావ్?" రమ అన్నది.

"ఎలాగో కాలం గడుస్తోంది."

"చదువుకున్నారా? ఏదైనా చిన్న ఉద్యోగం చూస్తే చేస్తారా?" అన్నాడు జడ్జి రాజారావు.

కర్టెన్ కదిలింది. వసుధ ఆత్రంగా ఆ వైపు చూసింది.

"డాడీ! మమ్మీ! ఛీరియో!" అంటూ క్రికెటు బాట్ తీసుకొని ఒక ఇరవై రెండు సంవత్సరాల కుర్రవాడు బయటికి వెళ్ళిపోయాడు.

"పిల్లలెవరైనా చేతికి అందివచ్చారా?"

"లేదండీ. అందరూ చదువుతున్నారు. ముగ్గురు స్కూల్లోనే ఉన్నారు?"

"ఎలా గడుస్తుంది?" సాలోచనగా అన్నారు రాజరావు.

"ఫామిలీ పెన్షన్ వస్తోంది. నాకు మావారి ఆఫీసులోనే యల్. డి. సి. ఉద్యోగం యిచ్చారు."

అంతలో బేరర్ కూల్ డ్రింక్స్ తెచ్చాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకండీ!" మొహమాటపడిపోయింది వసుధ.

"తీసుకోండి. ఎండలో వచ్చారు." అన్నది రమ జాలిగా ఆమెకేసి చూస్తూ.

"నా సహాయం ఏదైనా కావాలంటే చెప్పండమ్మా! మొహమోటం వద్దు." అన్నాడు రాజారావు ఆమె ఊరికే వచ్చి ఉండదని ఊహించి.

"అదేం లేదండీ. మా వారు ఎప్పుడూ మీ గురించి చెబుతూ ఉండేవారు. ఆ రోజు మిమ్మల్ని సూపర్ బజార్‌లో చూశాను."

"అవునవును! ఏమిటో ఈ మధ్య మతిమరుపు ఎక్కువైంది. మిమ్మల్ని చూడగానే ఎక్కడో చూశానను కున్నాను. కాని గుర్తు రాలేదు."

"మావారి జ్ఞాపకశక్తి గురించి అడక్కండి."


*With Best Compliments*

**MAHESHWARI ENGINEERING ENTERPRISES**

AMEERPET

HYDERABAD

"సాయంకాలం డాబామీద కూర్చుంటామా? మా అమ్మాయి వస్తుంటే 'చూడు రమా! ఆ పిల్ల అచ్చం మన అమ్మాయిలాగే ఉంది కదూ' అంటారు. మా కుక్కను రోడ్డు మీద చూసి 'మన కుక్కలాగే ఉంది కదూ' అంటారు. ఆయన చూడగానే ఎంతమందిలోనైనా గుర్తుపట్టేది నన్ను ఒక్కదాన్నే." అంటూ రమ పకపక నవ్వింది.

"నిన్ను గుర్తుపట్టకపోతే ప్రమాదం కదూ? ఎవరెంటయినా పడితే దేహశుద్ధి చేస్తారు." అన్నారు జడ్జీగారు.

ఇద్దరూ ఫక్కున నవ్వారు.

వసుధకు కూడా నవ్వు వచ్చింది.

"మీ కెంతమంది పిల్లలండీ?"

"ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల." అన్నది రమ.

వసుధ గుండె దడదడ లాడింది.

"అదుగో వస్తోంది అమ్మాయి. ఇద్దరు మగపిల్లలూ ఒక ఎత్తు అది ఒక్కర్తీ ఒక ఎత్తు, ఇరవై ఏళ్లు దాటినా పసిపిల్లలా అల్లరి చేస్తుంది. నేను విసుక్కున్నా ఆయన ఊరుకోరు."

నల్ల ఫియట్ లోపలకు వచ్చింది.

నీలం నైలెక్సు చీరలో బంగారు తీగలా పొడవుగా మెరిసిపోతూ ఒక యువతి దిగింది. చేతిలో పుస్తకాలున్నయ్. పరుగులాంటి నడకలో "ఓ మమ్మీ.... అరే డాడీ కూడా ఇక్కడే ఉన్నారే.... ఇవ్వాళ నేను ఎనిమిదో వండర్ చూశాను." గలగలమంటూ పుస్తకాలు టేబుల్ మీదకు గిరాటుపెట్టి తల్లిపక్కన సోఫాలో కూర్చుంది.

"డాడీ!" ఏదో చెప్పబోయి కొంచెం దూరంలో కూర్చుని ఉన్న వసుధను చూసి ఆగిపోయింది. వసుధ వళ్ళంతా కళ్లు చేసుకొని ఆ యువతినే చూస్తున్నది.

"చూశారుగా? అంతా హడావిడే! మా శకుంతల ఇంట్లో ఉంటే మరొకరు మాట్లాడే పనేలేదు."

"శకుంతలా? శకుంతల పేరు పెట్టారా? ఎంత కరెక్టుగా పెట్టారు?"

"ఆమె ఎవరు మమ్మీ!"

"తెలిసినవాళ్ళమ్మా! మీ నాన్నగారి స్నేహితుడి భార్య. పాపం ఈ మధ్యనే భర్త పోయాడు."

వసుధ శకుంతలవైపు చూసింది.

శకుంతల వసుధను జాలిగా చూసింది.

"ఇలా రా తల్లీ!" ఎంతో ఆప్యాయంగా పిల్చింది వసుధ. అలా పిలుస్తున్నప్పుడు ఆమె కంఠం వణికింది.

శకుంతల వెళ్ళి ఆమె పక్కన కూర్చుంది. పై పెదవి


*With Best Compliments from :*

**HYDERABAD POLYMERS PVT. LTD.,**

83/A, Industrial Development Area,
JEEDIMETLA, HYDERABAD-500 854.

*Registered Office :*

Lane oppesite to Prabhath Talkies,
Kacheguda, HYDERADAD.
Phone : 56857

**Manufactures of HDPE Woven Stacks**

మీదఉన్న పుట్టు మచ్చను తాకుతూ "హే బ్యూటిఫుల్ !" తనలో తనే అనుకుంటున్నట్టు అన్నది.

శకుంతల ఆశ్చర్యంగా వసుధ ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

"నువ్వెళ్లి టిఫెన్ తిను తల్లీ !" అన్నది రమ.

శకుంతల అలా ఆమె పక్కన కూర్చోవడం రమకు రుచించలేదు.

"నా పుట్టుమచ్చ మీకు నచ్చిందా ?"

"నీ పుట్టుమచ్చేకాదు తల్లీ నిన్ను చూడగానే నా కళ్ళు ఏదో వెలుగుతో నిండిపోయాయి."

"మమ్మీ ! నో ! నో ! నీకు ఇంటరెస్టు ఉండదు. డాడీకి చెబుతాను. డాడీ ఇవ్వాళ బలే తమాషా జరిగింది. అచ్చం సినిమాలలోలాగే ! మీ రెవరూ కలలో కూడా ఊహించని వింత...."

"ఏమిటమ్మా అది ? సస్పెన్సులో పెట్టక చెప్పు !"

"ఇవ్వాళ ఓల్డు స్టూడెంట్సు డే అని ఉమెన్సు కాలేజీకి వెళ్ళానా ?"

"యస్. వెళ్ళావు !"

"ఈ కబుర్లు తర్వాత చెప్పుకోవచ్చు. ముందు నువ్వెళ్లి టిఫెన్‌చెయ్యవే తల్లీ." రమ విసుగ్గా అన్నది.

"ఓ మమ్మీ ! నువ్వు కాసేపు ఊరుకుంటావా ? డాడీ ! నో ! మిలాడ్ ! ఆమె ఇన్‌టర్‌ఫియరెన్సు...."

"యస్. యస్. యూ ప్రొసీడ్ !" అన్నారు జడ్జీగారు.

రమ చిరాగ్గా చూసింది.

వసుధ గుండెల్లో సముద్రాలు పొంగుతున్నాయ్. ఒక వైపు ఆనందం.... తన బిడ్డను మనసారా కౌగలించుకోలేని తన అసహాయతమీద జాలి.... బాధ.... అనేక భావాల సమ్మేళనం....

వసుధ కన్నార్పకుండా శకుంతల్ని చూస్తున్నది.

"అలా గుడ్లప్పగించి చూస్తుందేం ? పిల్లకు దిష్టి తియ్యాలి." రమ మనసులోనే అనుకుంది.

"మిలాడ్. ఇవ్వాళ ఏం జరిగిందంటే...." లేచి నిల్చుని చేతులు ఎగరేస్తూ లాయర్‌లా యాక్టుచేస్తూ చెప్పసాగింది.

"ప్రొసీడ్ ఐ సే !"

"ఇవ్వాళ ఉమెన్సు కాలేజీ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఒక అమ్మాయిని చూశాను. అచ్చం నా పుట్టుమచ్చలాంటి పుట్టుమచ్చే ఉన్నది.

"మేడమ్ ! శకుంతలా సహజా కవలపిల్లలా ఉన్నారు కదూ ?" అన్నది ఒకమ్మాయి తెలుగు మేడమ్‌తో!

వసుధ తృళ్లిపడింది.

ముఖంలో భావాలు మారుతున్నాయ్.

"ప్రొసీడ్ !"

"ఆ తర్వాత తెలుగు మేడం ఆశ్చర్యంగా ఇద్దర్నీ మార్చి మార్చి చూసింది. వాట్ ఎ వండర్ ? ఒకే పోలిక. కాకపోతే సహజ చిన్నది. కొంచెం రంగు తక్కువ అన్నది," తెలుగు మేడం.

"పుట్టుమచ్చ చూసి ఆశ్చర్యపడ్డానేగాని ఆమెకూ నాకూ పోలికలున్నట్టు నాకు తోచలేదు. మా ఇద్దర్నీ ప్రిన్సిపాల్ రూంలో ఉన్న అద్దం ముందు నిల్చోబెట్టారు. ఇద్దరం తృళ్లిపడ్డాం. ఒకరి ముఖంలోకి ఒకరం చూసుకున్నాం. నేను అనుకోకుండానే అమాంతం ఆ అమ్మాయిని కౌగలించు కున్నాను. ఆ అమ్మాయి బీదపిల్లలా ఉంది. సరైన బట్టలు కూడా లేవు. నేను అడిగిన ఒక ప్రశ్నకూ సరిగా సమాధానం ఇవ్వలేదు. బిడియంగా నిల్చుంది. ఈజ్ ఇట్ నాట్ యాన్ ఐత్ వండర్ డాడీ !"

"సే మిలాడ్ !"

"యస్. మిలాడ్ !"

"ష్యూర్ ! ఆ అమ్మాయిని రేపు ఇక్కడకు తీసుకు రావలసిందిగా కోర్టువారి ఆర్డర్ !"

"మీ కేమైనా మతిపోయిందా ?" అన్నది రమ. రమ ముఖం వెలవెలా పోతున్నది.

వసుధ అక్కడ కూర్చోలేకపోతున్నది. మరి కొంచెం సేపు ఉంటే దుఃఖం పొంగుకొచ్చేలా ఉంది.

"వస్తానండీ !" వణుకుతున్న చేతులెత్తి నమస్కరించి చరచర బయటికి వెళ్ళిపోయింది.

"అరే ! అలా వెళ్ళిపోయిందేం ? పాపం ! ఏదైనా సహాయంకోసం వచ్చి ఉంటుంది. మన గోలలో మనం ఆమెను మర్చేపోయాం !" నొచ్చుకున్నారు జడ్జీగారు.

"పనిఉంటే మళ్ళీ ఆవిడే వస్తుందిలెండి." అన్నది రమ.

"పాపం పనిమీద వచ్చిందేమో ? నేను వెళ్ళి కేక వెయ్యనా ?"

"ఇప్పుడేమీ వద్దు కాని, పద నువ్వు టిఫెన్ చెయ్యి."

"మమ్మీకి ఎప్పుడూ నా తిండిగొడవే డాడీ ! ఇప్పటికే లావెక్కి పోతున్నానంటున్నారు అందరూ. ఇక నుంచి నో టిఫెన్. నో నెయ్యి.... నో పప్పు...." అంటూ కిలకిల నవ్వింది శకుంతల,

* * *

వసుధ ఎలా ఇంటికి చేరిందో ఆమెకే తెలియదు. తన బిడ్డను ఇరవై ఏళ్ల తర్వాత చూసింది. అయినా గుండెలకు హత్తుకొని మనసారా ఏడవలేకపోయింది.

ఇంటికి వస్తూనే గడపలో కూలబడి భోరుమంది.

"అమ్మా! అమ్మా! ఏమైంది?" సహజ తల్లి పక్కన కూర్చుంది.

సహజను గట్టిగా గుండెలకు హత్తుకుంది. శకుంతలను హత్తుకున్న అనుభూతిని పొందుతూ వెక్కి-వెక్కి ఏడ్చింది.

"తల్లీ నన్ను క్షమిస్తావు గదూ? ఎంత కాలానికి చూశానమ్మా! అయినా కళ్లారా చూసే అదృష్టానికి నోచుకోలేదు. మనసారా నీచేత అమ్మా అనిపిలిపించుకొనే భాగ్యం నాకు లేదు తల్లీ. నన్నను క్షమించమ్మా!"

సహజ తల్లిచేతుల్ని విడిపించుకుంది.

అమ్మకు ఏమైంది?

మతిపోయిందా?

తనను చూసి ఎంతోకాలం అయిందంటుందేమిటి?

తల్లికేసి భయం భయంగా చూసింది.

"అమ్మా! అమ్మా! ఏమిటమ్మా నువ్వంటున్నది?" అన్నది సహజ ఏడుస్తూ.

వసుధ సహజకేసి చూసింది. పుట్టుమచ్చ మీద గోముగా నిమురుతూ "బ్యూటిఫుల్!" అన్నది.

"ఓరే తమ్ముడూ! రఘూ!" దూరంగా జరిగి భయంగా తమ్ముణ్ణి కేకవేసింది.

వసుధ తృళ్లిపడింది.

సహజను చూసింది.

కళ్ళు తుడుచుకుంది.

"ఏం లేదమ్మా! మీ నాన్న గుర్తొచ్చారు. ఏదేదో పిచ్చిగా మాట్లాడాను. భయపడకు. నాకు ఇంకా మతిపోలేదు." అన్నది వసుధ.

"ఏమిటక్కా!" అంటూ రఘు వచ్చాడు.

సహజ ఏమి చెప్పలేదు.

తల్లికేసి చూసింది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్? ఏడిస్తే పోయిన నాన్న తిరిగి వస్తాడా?" అన్నాడు రఘు.

వసుధ మాట్లాడకుండా రఘును దగ్గరకు తీసుకొని తల నిమిరింది.

"అమ్మా నేను కొంచెంసేపు అలా వెళ్ళివస్తాను." అన్నాడు రఘు.

"వెళ్ళు బాబూ!" అన్నది.

రఘు వెళ్ళిపోయాడు.

"చిన్న తమ్ముడూ చెల్లెలూ ఎక్కడమ్మా?"

"ఎదురింట్లో ఆడుకుంటున్నారు." సహజ తల్లి ముఖంలోకి చూస్తూ అన్నది.

వసుధ సహజను చూసింది.

శకుంతల గుర్తుకొచ్చింది. కారులో దిగింది శకుంతల. మెరిసిపోతూ ఉన్నది. అమ్మకాని అమ్మకూ నాన్నకాని నాన్నకూ గారాలపట్టి.

కాని సహజ.

సరైన తిండి లేదు. సన్నగా పీలగా ఉన్నది. మాసిపోయిన పాత వాయల్ చీరలో ఆమె అందం అంతగా కన్పించడం లేదు.

శకుంతల ఇక్కడ ఉంటే? ఇలాగే ఉండేది. అది ఎంతో సుఖంగా ఉన్నది. తనకు అంతకంటే ఏం కావాలి. "తల్లీ! నువ్వైనా సుఖంగా ఉన్నావ్! అంతే చాలమ్మా! నిన్ను సుఖంగా చూశాను. నాకు ఈ అనుభూతి చాలు తల్లీ!" మనసులోనే అనుకుంది.

"అమ్మా ఇవ్వాళ బలే తమాషా జరిగిందమ్మా!" అన్నది సహజ.

వసుధకు తెలుసు సహజ ఏం చెప్పబోతున్నదో. అయినా "ఏం జరిగింది తల్లీ!" ఆ విషయం ఆమెకు మళ్ళీ మళ్ళీ వినాలని ఉన్నది.

"ఆ అమ్మాయి పేరు శకుంతలట. జడ్జీగారి అమ్మాయి. యూనివర్సిటీలో ఎం. ఏ. చదువుతున్నది. మా కాలేజీ ఫంక్షన్‌కు వచ్చింది. అచ్చం నాలాగే ఉందమ్మా! నిజంగా అచ్చం నాలాగే ఉంది. ఆ అమ్మాయి బట్టలు నేను వేసుకొని వాళ్ళింటికి వెళ్తే వాళ్ళ అమ్మా నాన్న కూడా నన్ను వాళ్ళ అమ్మాయనే చూడగానే అనుకుంటారు. ఇద్దరం అద్దంముందు నిల్చున్నాం. పుట్టుమచ్చ కూడా అచ్చం నాకులాగే ఉన్నది. కాలేజీలో పిల్లలూ, మా మేడమ్స్ కూడా ఆశ్చర్యపోయారు," అంటూ ఆగి తల్లి ముఖంలోకి చూసింది.

"నీకు నమ్మకంగా లేదా? ఆ అమ్మాయి ఎంత మంచి దనుకున్నావ్? నన్ను చూసి బలే సంతోషపడింది. రేపు వాళ్ళింటికి తీసుకెళ్తానంది."

"నువ్వేమన్నావ్?"

"నేను ఏమీ అనలేదు."

"వెళ్తావా?"

"ఊహూ!"

"ఏం?"

"వాళ్లు చాలా గొప్పవాళ్లు. ఈ బట్టల్లో నేను వాళ్ళింటికి ఎలా వెళ్ళానమ్మా!"

"కొత్త చీర ఉందిగా?"

"ఏం చీరేమిటి? బోడి వాయల్ చీరేగా?"

"రేపు ఆ అమ్మాయి పిలిస్తే?"

"మనింటికే రమ్మంటాను."

"వస్తుందా?"

"ఆఁ! చాలా మంచిది. కొంచెం కూడా గర్వం లేదు."

"ఊహూ! మనింటికి కూడా తీసుకు రాను!" మళ్ళీ తనే అన్నది.

వసుధ తలెత్తి కూతురి ముఖంలోకి చూసింది.

"అంత గొప్పవాళ్ళమ్మాయిని మనింటికి ఎలాగమ్మా పిలవడం? కూర్చోటానికి మంచి కుర్చీ అయినా లేదు. ఏమనుకుంటుంది?"

"సహజా! బీదతనం పాపం కాదమ్మా! మనం బీద వాళ్ళం అయినందుకు సిగ్గుపడనక్కర్లేదు. మనల్ని చూసి ధనవంతులే న్యాయంగా సిగ్గుపడాలి."

వసుధ మాటలు సహజకు అర్థంకాలేదు.

"వెళ్ళి చెల్లాయినీ తమ్ముణ్ణీ తీసుకురా! చీకటి పడుతోంది." అంది తల్లి మాట మారుస్తూ.

"ఇంకా ఐదన్నా కాలేదు. అప్పుడే చీకటి ఏమిటమ్మా!"

"పోయి చదువుకో! ఈ మధ్య నీకు వాగుడు ఎక్కువ అయింది."

అకస్మాత్తుగా తల్లికి తన మీద ఎందుకు చిరాకు కలిగిందో అర్థంకాలేదు.

లేచి వెళ్ళిపోయింది.

వసుధకు ఎవరితోనూ మాట్లాడాలని లేదు. ఒంటరిగా కూర్చుని శకుంతలను చూస్తున్నప్పుడు కలిగిన బాధనూ, సంతోషాన్నీ మళ్ళీ మళ్ళీ నెమరువేసుకోవాలని ఉన్నది.

* * *

రెండు రోజులు గడిచిపోయాయి.

వసుధకు మళ్ళీ శకుంతలను చూడాలని వుంది.

కాని ఎలా?

మళ్ళీ వాళ్ళింటికి వెళ్తే ఏమనుకుంటారు?

ఆఫీసునుంచి వచ్చి వంట చేస్తూ ఆలోచిస్తున్నది. రేపు ఒకసారి యూనివర్సిటీకి వెళ్ళి ఆ అమ్మాయి వచ్చే సమయానికి గేటుదగ్గిర నిల్చుంటే?

సహజను రెండు రోజుల నుంచీ ఆ 'అమ్మాయి కన్పించిందా అని అడిగింది. తెల్లవారి వచ్చి ఇంటికి తీసుకెళ్తానని చెప్పిన శకుంతల మళ్లీ రాలేదట. "వాళ్ల అమ్మా నాన్నా వద్దన్నారేమో!" అని సహజ అంటుంటే ఎవరో గుండెల్ని గట్టిగా పిండుతున్నట్టు విలవిలలాడి పోయింది తను.

ఆరయింది. సహజ యింకా రాలేదేం? ఈ మూడు రోజుల నుంచీ శకుంతలను తల్చుకుంటూ ఈ పసివాళ్ల గురించి తను సరిగా పట్టించుకోవడం లేదు.

వసుధ వాకిట్లోకి వచ్చింది.

అప్పుడే వాకిలిముందు చిన్న ఫియట్ కారు ఆగింది. అదే కారు! అదే చీర! శకుంతల వచ్చిందా?

సహజ కారు దిగింది.

వసుధ కళ్ళు పెద్దవిచేసుకొని చూస్తూ నిల్చుంది. కారు కదిలి వెళ్ళిపోయింది.

"అమ్మా! ఎలా ఉన్నాను?" ఉత్సాహంగా తనని పట్టుకొని గిరగిర తిప్పసాగింది సహజ.

"వదులు. నాకు కళ్ళు తిరుగుతున్నాయ్!"

"అమ్మా ఎలా ఉన్నాను!"

"ఈ చీర ఎక్కడిది?"

"అక్క ఇచ్చింది."

వసుధ త్రుళ్లి పడింది.

"అక్కా!"

"అదే ఆ అమ్మాయి శకుంతల....తనను అలాగే పిలవమన్నది. ఆ రోజు ఆమె కట్టుకున్న చీర బాగుంది అన్నాను. ఇవ్వాళ అలాంటిదే కొని తెచ్చింది. తనూ అదే కట్టుకొని వచ్చింది. బలే తమాషా జరిగిందిలే. నేను రానంటుంటే వినిపించుకోకుండా నన్ను వాళ్లింటికి తీసుకెళ్ళింది. మా ఇద్దర్నీ చూసి వాళ్ల డాడీ, మమ్మీ బిత్తరపోయారు తెలుసా? వాళ్ళ డాడీ చాలా మంచివాడు మమ్మీ! వాళ్ళ మమ్మీ మాత్రం నన్ను సరిగా పలుకరించలేదు. పైగా ముఖం సీరియస్‌గా పెట్టుకుంది." గుక్క తిప్పుకోకుండా చెప్పి తల్లి ముఖంలోకి చూసింది.

వసుధ కళ్లలో మెరుపు చూసి మళ్లీ సంతోషంగా చెప్పసాగింది.

"వాళ్ళ ఇల్లు ఎంత బాగుందనుకున్నావ్? టిఫెన్ చేశాను. నన్ను మనింటిదాకా వచ్చి పంపిస్తానంటే వాళ్ళమ్మ ఎక్కడకో వెళ్ళాలి వద్దు అన్నది. అందుకే నన్ను కార్లో పంపించింది."

శకుంతలను వాళ్ళ అమ్మ వద్దు అన్నదా? ఇద్దర్నీ చూసి ఆమెకు భయం పట్టుకొని ఉంటుంది. పెంచిన ప్రేమ రహస్యం బయట పడుతుందని భయం! మరి! అది సహజమే!

సహజ లోపలకు వెళ్ళి చీర మార్చుకొని వచ్చింది.

"సహజా! ఎవరయినా ఇస్తే చీరలు తీసుకోవడం తప్పు కదూ?"

"నేను తీసుకోనన్నాను. ఆ అమ్మాయి బలవంతం

చేసింది. అయినా తీసుకోలేదు. తను చచ్చినంత ఒట్టు తీసుకోకపోతే అన్నది. అప్పుడు తీసుకున్నాను."

"మంచిపని చేశావ్!"

"రేపు ఇచ్చెయ్యనా!"

"వద్దమ్మా! వద్దు! ఆ అమ్మాయి మనసు నొప్పించకు," అన్నది వసుధ.

"ఆ అమ్మాయిని మనింటికి తీసుకురానా?"

"తప్పకుండా తీసుకురా తల్లీ. నాకూ చూడాలని ఉన్నది." బొంగురు కంఠంతో అన్నది తల్లి.

* * *

మరునాడు సాయంత్రం సహజ శకుంతలను ఇంటికి తీసుకొచ్చింది.

వసుధ ఎదురుగా పరుగెత్తి గట్టిగా హృదయానికి హత్తుకుంది. నొసటి మీదా, తలమీదా ముద్దులు పెట్టుకుంది. తల్లి ప్రవర్తన సహజకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అమ్మా!" సహజ దాదాపు అరిచినట్టే అన్నది.

ఆ అమ్మాయి ఏమైనా అనుకుంటుందని సహజ భయం.

"ఏదీ తల్లీ! ఒకసారి కళ్లారా నీ ముఖాన్ని చూడనియ్? ఈపాడు కన్నీరు అడ్డుపడుతున్నది." అంటూ కళ్ళుతుడుచుకుంది. మళ్ళీ కళ్ళలోకి నీరు ఉబికింది.

శకుంతలకు ఆమె ప్రవర్తన ఆశ్చర్యంగా ఉన్నది.

ముఖ్యంగా ఆమెను మొదటిసారిగా తప ఇంట్లో చూసింది. ఆమె ముందే తను సహజను కలుసుకున్న విషయం చెప్పింది. కాని ఆ పిల్ల తన కూతురేనని చెప్పలేదు. లేచి గబగబ వెళ్ళిపోయింది.

"కూర్చో అక్కా!" చెయ్యిపట్టుకొని చాపమీద కూర్చోపెట్టింది సహజ.

"మా ఇంట్లో కుర్చీలు లేవు," అన్నది సహజ.

"ఫర్వాలేదు." అని "ఏమండీ మీరు ఆరోజు మాఇంటికి వచ్చారు గదూ?"

తల ఊపింది వసుధ.

"నన్ను చూసి మీరు ఆ రోజు కూడా........"

వసుధ గాభరాపడింది.

"ఏం లేదమ్మా! సహజకు ముందు నాకో కూతురు పుట్టింది. ఇప్పుడు ఆ పిల్ల ఉంటే నీలాగే ఉండేది అనిపించింది."

"పాపం! చచ్చిపోయిందా?"

వసుధ మనసులో శూలం గుచ్చుకున్నట్టయింది.

కాని మౌనంగా ఉండిపోయింది.

"అరే నాకు కూడా ఆ విషయం అమ్మ ఎప్పుడూ చెప్పలేదు," అన్నది సహజ.

అప్పుడేవచ్చిన రఘు శకుంతలను ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుండిపోయాడు.

"జడ్జిగారి అమ్మాయి. నా ఫ్రెండు!" సహజ గర్వంగా చెప్పింది.

"వీడు మా పెద్దతమ్ముడు. ఇంటర్ ఫస్టుఇయర్ చదువుతున్నాడు," అంటూ రఘును పరిచయం చేసింది. రఘుకు ఆడపిల్లలంటే తగని సిగ్గు. లోపలకు వెళ్ళిపోయాడు.

అంతలో చిన్నపిల్లలిద్దరూ వచ్చారు. శకుంతల డ్రైవర్ను పిల్చి బిస్కెట్లు తెమ్మని పంపించింది. వసుధ వంటింట్లో కాఫీ కాస్తున్నది.

వసుధ ఇచ్చిన కాఫీ తాగుతుండగానే డ్రైవర్ బిస్కట్ పొట్లాలు తెచ్చాడు. శకుంతల చిన్నవాళ్లిద్దరికీ ఇవ్వబోయింది. వాళ్లు తల్లి ముఖంలోకి చూశారు.

"ఏమండీ! పిల్లల్ని మంచి డిసిప్లిన్‌లోనే పెంచినట్లున్నారే!" నవ్వుతూ అన్నది శకుంతల.

"తీసుకోండి." వసుధ అన్నది.

పిల్లలు ముందుకు వచ్చి గబుక్కున అందుకున్నారు.

"అక్కకు థ్యాంక్సు చెప్పండి," అన్నది వసుధ.

"థ్యాంక్సు" అన్నారు.

శకుంతల వాళ్ల బుగ్గలు పిండుతూ, "ముద్దుగా ఉన్నారు. నాకు ఇద్దరూ అన్నయ్యలే!" తనకు చెల్లెళ్లు, తమ్ముళ్లు లేనందుకు బాధపడుతున్నట్లు అన్నది.

వసుధ మనసు మొద్దుబారి పోయింది. సంతోషాన్నిగానీ దుఃఖాన్ని గానీ మనసు ఒక హద్దువరకే స్వీకరించగలదు. మితిమీరిన ఆనందంలో మనిషికి ఏంచెయ్యాలో తోచదు.

"చీకటి పడుతోంది. మమ్మీ గొడవ చేస్తుంది. వస్తానండీ!" అంటూ వసుధకు నమస్కరించింది.

"పోయిరా తల్లీ!" అనాలనుకున్నది. కాని అనలేకపోయింది. నమస్కరించిన చేతుల్ని పట్టుకొని ప్రేమగా ముఖంలోకి చూసింది.

"మళ్లీ వస్తావా అక్కా!" చిన్నవాడు రాము అడిగాడు.

"ఓరి దొంగ వెధవా? బిస్కెట్లకోసం కదూ," అన్నది సహజ.

"వస్తాను బాబూ! బిస్కెట్లు కూడా తెస్తాను."

"మరి నాకో?" అందరి కంటే చిన్నది సరళ అన్నది.

"నీకూ తెస్తాను."

"ఇన్ని తేవాలి" చేతులు రెండూ దూరంగా పెట్టి చూపించింది.

అందరూ పక్కున నవ్వారు.

శకుంతల వెళ్ళిపోయింది.

వసుధ గడపలో నిలబడి కారు వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయింది ఎంతోసేపు.

* * *

"ఇంతసేపు ఎక్కడున్నావమ్మా! మీ మమ్మీ నా ప్రాణం తోడేస్తున్నది." అన్నారు జడ్జీగారు కారు దిగి లోపలకు వచ్చిన కూతురితో.

"డాడీ! బలే చిత్రం జరిగింది!"

"రోజుకో చిత్రమైన విషయం తెస్తున్నావ్! బాగానే ఉంది వరస! పద! బట్టలు మార్చుకో!" తల్లి విసుక్కుంది.

సహజను చూసినప్పటి నుంచీ రమకు తెలియని భయం పట్టుకుంది. తన కూతురు తనకు కాకుండా పోతుందేమో ననే బెంగపట్టుకుంది. ఆ మాటే భర్తతో అంటే "నీకు అన్నీ అనుమానాలే!" అంటూ తేలిగ్గా నవ్వేశాడు.

తల్లి మూడ్ సరిగాలేదని అర్థంచేసుకున్న శకుంతల తను చెప్పదల్చుకున్న విషయం చెప్పలేదు. తను సహజ వాళ్లింటికి వెళ్ళినట్టు తెలిస్తే మరీ గొడవచేస్తుంది.

ఆ రాత్రి శకుంతల సహజ గురించీ, ఆమె తల్లిగురించీ ఆ ఇంటి దారిద్ర్యాన్ని గురించీ ఆలోచిస్తూ పడుకుంది.

ఆమెకు పాపం తనంటే ఎంత ప్రేమో! తనకు ఊహ తెలిశాక తన మమ్మీ కూడా తనను అలా ముద్దులు పెట్టుకో లేదు. అదే మరొకరైతే తను ఏవగించుకొని ఉండేది. కాని ఆమెను చూస్తుంటే తనకు ఎందుకో జాలివేస్తుంది.

వట్టి జాలేనా?

ఆమెను చూస్తుంటే తనకు ఏవరినో చాలా దగ్గరవాళ్ళను చూస్తున్నట్టే ఉన్నది. పాపం! ఆవిడ సంపాదనలో అంత మంది పిల్లల్ని పోషిస్తున్నది. తను ఆ కుటుంబానికి సహాయం చెయ్యగలిగితే ఎంత బాగుణ్ణు! కాని అందుకు ఆమె అంగీకరిస్తుందా?

ఆ తర్వాత కూడా శకుంతల అప్పుడప్పుడు వసుధ ఇంటికిపోయి వస్తూ ఉంటుంది. వసుధ టిఫెన్ చేసి ఎంతో ఆప్యాయంగా దగ్గిర కూర్చుని తినిపిస్తుంది. ఇది ఏనాటి బంధమో! అనిపిస్తుంది శకుంతలకు.

క్రమంగా ఆ ఇంట్లో శకుంతలకు చనువు ఏర్పడింది. వచ్చినప్పుడల్లా పిల్లలకు బిస్కెట్లు తెస్తుంది. వసుధకు పళ్లు తెస్తుంది. దీపావళి పండుగకు అందరికీ కొత్త బట్టలు తెచ్చింది. రఘుకు కూడా శకుంతల దగ్గిర చనువు ఏర్పడింది.

"ఇవన్నీ ఎందుకు తెస్తున్నావ్? మీ వాళ్లకు తెలిస్తే బాగుండదు," బట్టలు చూసి విసుగ్గా అన్నది వసుధ.

శకుంతల మనసు చిన్నబుచ్చుకుంది.

"మీ పెద్దమ్మాయి పోయిందన్నారు. ఆ అమ్మాయినీ చూసినట్టే నన్ను చూసి ఆనందానుభూతి పొందుతున్నారు. ఇలాగే మీ పెద్దమ్మాయి తెస్తే తీసుకోవడానికి సంకోచిస్తారా? మరెప్పుడూ మీకు ఇష్టంలేకపోతే ఏమీ తీసుకురానులెండి!

"అమ్మా శకుంతలా! నా బాధను నీకు ఎలా చెప్పనమ్మా!" బాధగా అన్నది వసుధ.

"ఈ చీర మీకు!"

వసుధ కన్నీళ్లు తుడుచుకున్నది.

"నీకు ఇంత డబ్బు ఎక్కడిదమ్మా!"

"డాడీ నాకు ప్రతినెలా పాకెట్ మనీ ఇస్తారు. ఇంతకు ముందు సినిమాలకూ, స్నేహితులకూ, హోటళ్లకూ ఖర్చు చేసేదాన్ని. ఈసారి అలా చెయ్యకుండా ఆరునెలల నుంచి కూడబెట్టాను," అన్నది శకుంతల.

వసుధ కళ్లు చెమ్మగిల్లాయి.

"మీ మమ్మీకీ డాడీకీ తెలిస్తే బాగుండదు తల్లీ."

"వాళ్లు చాలా మంచివాళ్లు. నా సంతోషానికి అడ్డురారు."

శకుంతల బయలుదేరింది.

భోజనం చేసిపో తల్లీ!" అన్నది వసుధ.

"వద్దండీ! మా మమ్మీ డాడీ నాకోసం ఎదురుచూస్తుంటారు," అంటూ కార్లో కూర్చుంది.

* * *

భోజనం చేస్తున్న శకుంతల గంభీరంగా ఉన్నది. ఏదో ఆలోచిస్తున్నది.

"ఏమిటమ్మా అలా ఉన్నావ్?" తండ్రి అడిగాడు.

"దాని వాలకం బొత్తిగా మారిపోతుంది. ఇక చదివింది చాలు గాని పెళ్లిచెయ్యండి. ఆ 'చల్లపల్లి' సంబంధం ఖాయం చెయ్యండి," అన్నది తల్లి.

"అబ్బబ్బ! మమ్మీ నీకు ఎప్పుడూ పెళ్లిగొడవే."

"డాడీ!"

"ఏమ్మా!"

"ఆ రోజు మనింటికి ఒకామె వచ్చింది...."

"ఏ రోజు? ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు."

"అదే డాడీ! మీ స్నేహితుడి భార్య. ఆయన లారీ యాక్సిడెంటులో పోయాడన్నారు....?"

"ఆఁ ఆఁ అవును! మర్చేపోయాను. పాపం! ఎలా ఉన్నారో ఏమో! ఒక్కసారి కూడా వెళ్ళి చూడలేదు."

"ఆమె ఎవరో తెలుసా?"

"ఎవరు?"

"సహజ తల్లి!"

"సహజా! ఆమె ఎవరు?"

"అదే డాడీ! ఆ అమ్మాయి, అచ్చం నాలాగా ఉంటుంది చూడూ...."

రమ చివ్వున తలెత్తి కూతురి ముఖంలోకి చూసింది. కళ్లు తిప్పి భర్త ముఖంలోకి గాభరాగా చూసింది.

రాజారావు ముఖం గంభీరంగా మారింది. అతను కూడా ఆలోచనలో పడ్డాడు.

"అలాగా?" తనకు తనే చెప్పుకుంటున్నట్టు మళ్ళీ అన్నాడు.

"అవును డాడీ! పాపం చాలా బీదతనంలో ఉన్నారు. నలుగురు పిల్లల్ని ఆమె ఒక్కర్తే పోషించాలి. సరైన తిండి కూడా ఉండదు.

"నీ కెలా తెలుసు?"

"నేను వాళ్ళింటికి వెళుతుంటాను," అనేసి నాలుక కరచుకుంది శకుంతల.

"వాళ్ళింటికి వెళుతుంటావా? ఎప్పుడూ చెప్పలేదేం?" రమ కంఠం తీవ్రంగా ఉంది.

"నీకు ఇష్టం ఉండదని. ఆమెకు నేనంటే చాలా ప్రేమ మమ్మీ! ఆ పిల్లల్ని చూస్తుంటే జాలివేస్తుంది."

రమ ముఖం పాలిపోయింది.

ఏదో అనబోయి భర్తముఖంలోకి చూసి ఆగిపోయింది.

"వాళ్లకు మరేదైనా ఆదాయం పెరిగే మార్గం చూపించ కూడదా డాడీ!"

"ఆలోచిస్తాను."

"ఆలోచించడం కాదు. సహాయం చెయ్యాలి."

"అలాగే అన్నాగా! నీకు పరీక్షలు దగ్గరకు వస్తున్నాయ్. వెళ్ళి చదువుకో!" డైనింగ్ టేబుల్‌ముందు నుంచి లేస్తూ అన్నాడు జడ్జిగారు.

* * *

"నేను అనుకుంటూనే ఉన్నాను." రమ భర్తతో బొంగురుపోయిన కంఠంతో అన్నది.

రాజారావు మాట్లాడలేదు.

"మాట్లాడరేం?"

"ఏమిటి?"

"నా కర్మ! మీకు ఏదీ పట్టదు. పిల్ల విషయం!"

"ఇప్పుడేమైందని?"

"ఇంకా ఏం కావాలి?"

పక్క గదిలో చదువుకుంటున్న శకుంతల చెవులు రిక్కించి వినసాగింది.

"అది తనలాంటి పిల్లను కాలేజీలో చూశానని చెప్పినప్పుడే నాకు భయంపట్టుకుంది. ఇప్పుడు అది వాళ్లింటికి రాకపోకలు సాగించింది. శకుంతల తల్లి తప్పక ఆ వసుధే అయిఉండాలి."

శకుంతల తృళ్లిపడింది. చేతిలో పుస్తకం క్రిందపడింది.

"ఎందుకు ఇలా చేశారంటావ్?"

"ఏమో తెలియదు. ఆరోజు అది మన ఇంటికి వచ్చింది కూడా పిల్లను చూడటానికే అయివుంటుంది. శకుంతల మాటలు విని గబగబా లేచి వెళ్ళిపోయింది."

"మరి ఇన్నిరోజులుగా రాలేదేం?"

"భర్త భార్యకు తెలియకుండా పసిదాన్ని మన వాకిట్లో పడుకోబెట్టి పోయివుంటాడు. చస్తూ నిజం చెప్పి ఉంటాడు."

"నాకేమీ బోధపడటం లేదు. అతను అలా ఎందుకు చేశాడంటావ్?"

"నా కేం తెలుసు? ఆ రోజు మీరు మనకు ఆడపిల్లలు లేరని చెప్పారుగా? మన డబ్బుమీద కన్నుపడి ఉంటుంది. ఈ విషయం దానికి తెలిస్తే ఇంకేమయినా ఉందా? ఇంత కాలం సొంతబిడ్డగా పెంచాం." దాదాపు ఏడుస్తూనే అన్నది.

"ఇంతకాలం చెప్పని విషయం ఇప్పుడు మాత్రం ఎందుకు చెబుతారు!"

"ఎందుకా? దరిద్రంతో చస్తున్నారు. చిన్నగా దీన్ని ఆకర్షించి ఓ రోజు అసలు సంగతి చెప్పేస్తారు. బ్లడ్ ఈజ్ థిక్కర్ దాన్ వాటర్ అంటారు." అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఏడవకు. అమ్మాయి వింటుంది. పక్క గదిలోనే చదువుకుంటున్నది." అన్నాడు తండ్రి

"నేను వాళ్లింటికి వెళ్తాను. దానికి బుద్ధిచెప్పివస్తాను. అసలు మన పిల్లను వలలో పడేసుకోవడానికి కారణం నిలదీసి అడుగుతాను."

"ఆ పని చెయ్యకు. అసలుకే మోసం వస్తుంది."

"మరేం చెయ్యాలి."

"నాకు ఎటూ సుప్రీంకోర్టు జడ్జిగా త్వరలోనే ఆర్డర్సు రాబోతున్నాయ్. ఢిల్లీ వెళ్ళిపోతాం. అంతవరకూ అమ్మాయిని జాగ్రత్తగా వాళ్లింటి కెళ్ళకుండా చూద్దాం?"

"అదే ఎలాగంటున్నాను!"

"నువ్వు అమ్మాయిని తీసుకొని మీ పుట్టింటికి వెళ్ళు. అటునుంచే ఢిల్లీ రావచ్చును?"

"ఏమోనండీ నాకు భయంగా ఉంది?"

"భయమెందుకూ రేపే వెళ్ళండి"

"దానికి పరీక్షలు. రానంటే?"

"నేను ఒప్పిస్తాగా. నువ్వు భయపడకు" అన్నాడు రాజారావు.

"ఇక పడుకో! బాధపడకు?"

"నేను నిద్రపోయి ఎన్నాళ్లయిందో!"

పై మాటలు శకుంతలకు వినిపించలేదు.

తన తల్లి వసుధ?

అయితే తన నెందుకు మరొకరి గడపలో పారేసినట్టు? తన తండ్రి ఆ పని చేశాడా! ఛ! డబ్బుకోసం అలా చేస్తారా? కాదు...కాదు....అయి ఉండదు. ఆమె అలాంటిది కాదు. తనను చూడగానే ఆ కళ్లలో వచ్చే మెరుపుకు కారణం ఇదేనా?

శకుంతల రాత్రంతా నిద్రపోలేదు.

* * *

తెల్లవారి డైనింగ్ టేబుల్ ముందు శకుంతల ముభావంగా కూర్చుంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయ్.

"ఏమిటమ్మా అలా ఉన్నావ్?"

"ఏమీలేదు. రాత్రంతా చదివాను?"

కూతురి కళ్లలోకి చూశాడు.

కళ్లు ఎర్రగా ఉన్నయ్.

తన కూతురు రాత్రంతా చదవడమా? తను నమ్మలేదు. ఇంత స్తబ్దుగా ఎప్పుడూ ఉండదు. రాత్రి తాము మాట్లాడు కున్నది విన్నదేమో?

రాజారావు గుండెల్లో ఏదో కలుక్కుమన్నది.

"డాడీ! డాడీ?" అంటూ క్షణం ఊరుకోని శకుంతల ఒక్కసారికూడా అలా పిలవలేదు.

రమకు ఏమీ అడగాలనిపించలేదు. ఏమడిగితే ఏమం టున్నదో భయంగా ఉన్నది.

జడ్జీగారు కోర్టుకు వెళ్ళిపోయారు.

శకుంతల కాలేజీకి తయారైంది.

"త్వరగా వస్తావుగదూ తల్లీ!" రమ అడిగింది.

"ఊ" అన్నది.

వసుధ ఇంటిముందు ఫియట్ కారు ఆగింది. ఆ సమయంలో శకుంతల రావడం వసుధకు ఆశ్చర్యంగా అన్పించింది. పిల్లలందరూ స్కూలుకు కాలేజీకి వెళ్ళిపోయారు. ఆమె ఆఫీసుకు తయారౌతుంది.

"ఏం తల్లీ ఇలా వచ్చావ్?" తలనిమురుతూ అడిగింది వసుధ.

వసుధ గంభీరంగా ఉన్నది.

"ఒకటి అడుగుతాను. నిజం చెబుతారా?"

వసుధ బిత్తరపోయి శకుంతల ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

"నన్ను కన్నతల్లి ఎవరు?"

వసుధ పిచ్చి చూపులు చూసింది.

"నువ్వే కాదూ?"

అయోమయంగా చూసింది.

"చెప్పు! నువ్వే నా కన్నతల్లివి. నన్ను ఎందుకు వదిలేశావ్! రాజారావుగారి డబ్బుకు ఆశపడా?"

"శకూ?"

"మరి నేను అక్రమ సంతానాన్నా?"

"శకూ?" దెబ్బతిన్న జంతువులా అరిచింది వసుధ.

"నాకు సమాధానం కావాలి."

"నీకు ఈ సంగతి ఎవరు చెప్పారు?"

"ఎవరు చెబితేనేం? నాకు విషయం తెలుసుకోవాలని ఉన్నది. అవును నేను అక్రమ సంతానాన్నే అయివుంటాను. లేకపోతే........"

"శకుంతలా?"

"ఎందుకమ్మా అలా అరుస్తావ్?"

"నువ్వు నా బిడ్డవు కావు. జడ్జీగారి అమ్మాయివి?"

"అబద్ధం?"

వసుధ తలవంచుకుంది.

"నా జన్మ రహస్యం తెలుసుకోవాలని ఉన్నది. చెప్పక పోతే మళ్ళీ నా ముఖం నీకేకాదు నా పెంచినవాళ్లకు కూడా చూపను. నిన్ను చూడగానే నాకు గౌరవం ఏర్పడింది."

"నువ్వు అక్రమ సంతానాన్ని కనివుంటావని కూడా ఊహించలేకపోయాను?"

వసుధ భోరుమంది.

"తల్లీ! అంతమాట అనకు. నువ్వు అక్రమ సంతానానివి కాదమ్మా! నా మొదటి బిడ్డవు. నిన్ను పోగొట్టుకొని ఎన్ని రోజులు ఏడ్చానో నీకు తెలియదు! ఆరోజే నాలోని జీవం చచ్చిపోయింది. యంత్రంలా ఇంతకాలం జీవించాను."

గోడకానుకొని ముఖానికి పైటకొంగు అడ్డంపెట్టుకొని ఏడవసాగింది వసుధ.

శకుంతల రిలీఫ్‌గా నిట్టూర్పుంది.

తల్లి పక్కన కూర్చుని "అమ్మా" అన్నది.

ఒక్కసారిగా వసుధ గుండెలకు గాఢంగా హత్తుకొని నిండుకుండ బద్దలైనట్టు భోరుమన్నది.

"మరొకసారి 'అమ్మా' అని పిలువు తల్లీ" ఏడుస్తూనే అన్నది.

"అమ్మా"

"మళ్లీ?"

"అమ్మా!"

వసుధ ఆత్రంగా శకుంతల వళ్లంతా తడిమింది. నెత్తిమీద ముద్దులు పెట్టుకుంది.

క్రమంగా తేరుకుంది.

జరిగిన విషయం చిన్నగా చెప్పసాగింది.

శకుంతల కళ్ళవెంట నీరు కారిపోతున్నది.

"తల్లీ! ఈ సంగతి ఇంతటితో మర్చిపో! నువ్వు చాలా సుఖంగా ఉన్నావు. కళ్ళారా చూశాను. అంతే తల్లీ నాకు కావాల్సింది.

శకుంతల లేచింది.

"వెళ్ళొస్తానమ్మా"

మరో మాటకు అవకాశం ఇవ్వకుండా పరుగుతీసింది బయటికి. కార్లో కూర్చుంది.

ఆ రోజు కాలేజీలో అశాంతిగా కూర్చుంది.

ఇంటికి వచ్చేసరికి తల్లి పెట్టెలు సర్దుతున్నది.

రాజారావుకూడా ఇంటికి వచ్చేశాడు.

"వచ్చావా తల్లీ! త్వరగా కానియ్ బండికి టైం అవుతోంది."

"ఏం బండి? ఎక్కడికి?"

మమ్మీ అనలేకపోయింది.

"తాతగారి ఊరికి."

"అకస్మాత్తుగా ఇప్పుడెందుకూ?"

"నాన్నగారికి ఢిల్లీ ట్రాన్సఫర్ అవుతోంది."

"అయితే? ఇప్పుడు తాతగారింటి కెందుకూ?"

"అధిక ప్రశ్నలు వెయ్యకు. చెప్పినట్టు చెయ్యి?" రమ కూతుర్ని ఎప్పుడూ అంతగా కసురుకోలేదు.

"నేను రావడం లేదు. నాకు పరీక్షలు ఉన్నయ్!" ఖచ్చితంగా అన్నది శకుంతల.

"అదేమిటమ్మా? క్వార్టర్లీ పరీక్షలేగా! ఎటూ ఢిల్లీలో యూనివర్సిటీలో చేరాలి." అన్నాడు రాజారావు.

"మీ రెందుకు ఇలా అకస్మాత్తుగా నన్ను ఇక్కడ్నుంచి పంపిస్తున్నారో నాకు తెలుసు?"

తల్లిదండ్రు లిద్దరూ సర్పద్రష్టల్లా నిలబడిపోయారు.

"నిజం చెప్పండి. నేను మీ కూతుర్ని కాదు కదూ?"

"ఎవరు చెప్పారు? ఆ రాక్షసేనా? నేను అనుకుంటూనే ఉన్నాను," శకుంతలను కౌగలించుకొని భోరున ఏడ్చింది.

రాజారావు ఓపిక లేనట్టు కుర్చీలో కూలబడ్డాడు.

"అమెను ఏమీ అనకండి. రాత్రి మీ మాటలు విన్నాను. ఇవ్వాళ నిజం తెలుసుకొని వచ్చాను?" అన్నది శకుంతల.

"అయితే ఇప్పుడేమంటావ్!" రాజారావు అడిగాడు.

"నేను మా అమ్మ దగ్గరకు వెళ్తాను."

"ఇంత పెంచి గాలికిపోయామా? మేము నీకేం కామా?" భోరుభోరున ఏడవసాగింది రమ.

"అలా అనలేదు. మీరే నా తల్లిదండ్రులు. కాని ఇప్పుడు వాళ్ళకు నా అవసరం ఉన్నది. కొంతకాలం అక్కడే ఉంటాను?"

"అంటే?"

"వాళ్ళు ఎంత బీదతనంలో ఉన్నారో నాకు తెలుసు. నేను ఉద్యోగం చేస్తాను. ఆ ఇంటికి పెద్ద కూతురిగా చిన్నవాళ్ళను ప్రయోజకుల్ని చేస్తాను!"

"నీకు పిచ్చి పట్టిందా?" రాజారావు కోపంగా అన్నాడు.

"డాడీ! మీరు న్యాయమూర్తి! మామూలు మనిషిలా మాట్లాకండి!"

"నేను న్యాయమూర్తిని కోర్టులో! ఇంట్లో మామూలు మనిషినే నమ్మా. నిన్ను కనకపోయినా కన్న కూతురిలాగే పెంచాము. తండ్రి మనసు అర్థంచేసుకో! చూడు నిన్ను కనకపోయినా, నిన్ను ఎంతో ప్రేమగా పెంచిన నీ తల్లిగాని ఆ తల్లిని చూడు. ఎంత కుమిలిపోతుందో!"

రాజారావు పెద్ద కొడుకు తన గదివాకిట్లో నిల్చుని ఉన్నాడు. ఎవరూ చూడలేదు. అన్నీ విన్నాడు.

"నన్ను క్షమించండి. నా బాధ్యతను నెరవేర్చిన తర్వాత తిరిగి ఇక్కడికే వస్తాను!"

"అక్కర్లేదు. వెళ్ళిపో! నువ్వు ఎవరో కనిపారేసిన పాపిష్టి సంతానం అని మాకు తెలియదు?"

"అన్నయ్యా!"

"అలా పిలవకు?"

"నువ్వారుకోరా?" తండ్రి గాండ్రించాడు.

"నేను అక్రమ సంతానాన్ని కాదు."

"మరెందుకు పారేశారు?" అన్న మళ్ళీ అడిగాడు.

శకుంతల అసలు విషయం చెప్పింది.

"అయితే ఇప్పుడేమంటావ్?"

"నేను వెళతాను."

"పోవే! పో! పాపిష్టిదానా? ఎంతగా పెంచాం! కృతజ్ఞతకూడా లేదు?" ఆడపులిలా అరిచింది రమ.

శకుంతల అదోలా నవ్వింది,

"పెంచిన తల్లిని అనిపించావ్ మమ్మీ? ఏ తల్లీ కూతురు తనకి పెంచినందుకు కృతజ్ఞురాలుగా ఉండాలని కోరుకోదు."

"శకూ! పెద్దపెద్ద మాటలు మాట్లాడకు" తండ్రి.

"వెళ్ళవే వెళ్ళు! ఈ క్షణంలోనే నా ముందునుంచి వెళ్ళిపో! ఆ మురికికూపంలోకి వెళ్ళు. ఆ దరిద్రంలోకి వెళ్ళు!" పిచ్చిదానిలా అరుస్తుంటే పెద్దకొడుకు తల్లిని బలవంతంగా లోపలకు లాక్కెళ్ళాడు.

"వెళ్తున్నాను డాడీ!"

"మళ్ళీ ఈ గడప తొక్కే అర్హత నీకు ఉండదు!"

శకుంతల అదోలా నవ్వింది.

"డాడీ! తండ్రులు ఇలాంటి డైలాగ్స్ చెప్పడం ఎక్కువైందనే ఈ మధ్య ఇళ్లకు గడపలు పెట్టడంలేదు."

"ఇది హాస్యాలకు సమయం కాదు!"

"సరే! వస్తాను" గబగబా నడిచి బయటికి వెళ్లిపోయింది శకుంతల.

* * *

లోపలకు వస్తున్న శకుంతలను చూసి "అమ్మా శకుంత లక్కయ్య వచ్చిందే," అంటూ పిల్లలంతా శకుంతలచుట్టూ చేరారు.

"ఇవ్వాళ బిస్కెట్లు తేలేదు పాపా?" చిన్నపిల్లను దగ్గరకు తీసుకుంటూ అన్నది.

"ఇదేమిటి తల్లీ ఈవేళప్పుడొచ్చావ్" ఏదో సందేహంగా అడిగింది వసుధ.

"ఇవ్వాళ రాత్రి ఇక్కడ గడపాలని వచ్చానమ్మా?"

"మీ మమ్మీ డాడీకి చెప్పే వచ్చావా?"

"ఆహా!"

"వెళ్ళమన్నారా?"

"ఆఁ నాకు ఆకలేస్తుందమ్మా? అన్నం పెడతావా లేదా?"

"అయ్యో అదేమిటి తల్లీ. అర్ధగంటలో వంట పూర్తి చేస్తాను. కాని మీ మమ్మీ డాడీకి ఏమీ చెప్పలేదు కదూ?" భయంగా అడిగింది.

"నువ్విలా ప్రశ్నలు వేస్తుంటే నేను వెళ్ళిపోతాను."

"వద్దమ్మా ఉండు. వెంటనే వంట చేస్తాను." అంటూ వసుధ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి చెల్లెళ్లనూ తమ్ముళ్లనూ చుట్టూ పడుకోబెట్టు కొని నేలమీద పడుకుంది. వాళ్లకు అనేక కబుర్లు చెప్పింది. అందరూ నిద్రపోయారు.

శకుంతల తల్లి పడుకున్న చాపమీద పడుకుంది.

"నీకు ఇదేం కర్మ చెప్పు! మెత్తటి పరుపులమీద పడు కోక...."

"అమ్మా! ఇవ్వాళ నాకు చాలా సంతోషంగా ఉంది. తమాషా అనుభూతి కలుగుతుంది. నా సంతోషాన్ని నీ మాటలతో పాడుచెయ్యకు." అన్నది.

వసుధ కూతుర్ని రెండు చేతులతో దగ్గరకు లాక్కుని పడుకుంది.

కోడిరెక్కల క్రింది కోడిపిల్లలా వసుధ చేతుల్లో వదిగి పోయింది శకుంతల.

* * *

తెల్లవారి శకుంతల ఇంటికి వెళ్ళే ప్రయత్నం చెయ్య లేదు.

వసుధ ఆఫీసుకు వెళ్ళింది.

సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంకా శకుంతల అక్కడే ఉన్నది.

వసుధ చూస్తూ నిలబడిపోయింది.

"అమ్మా అక్క ఇక మనతోనే ఉంటుందట" అన్నది చెల్లెలు సహజ.

వసుధ అయోమయంగా చూసింది.

"నిజంగానే అమ్మా? అక్క ఉద్యోగం చేస్తుందట."

వసుధ నెత్తిన పిడుగుపడినట్టు అయింది.

"నిజమేనా శకూ?"

"అవునమ్మా!"

"నువ్వు ఇక్కడ ఉండటానికి వీల్లేదు. నీకు ఇదేం పోయేకాలమే. వాళ్లంత ప్రేమగా పెంచారు. పువ్వులో పెట్టుకొని పెంచారు. వాళ్లకు ద్రోహం చేస్తావా?"

"అదంతా నీకు అనవసరం! నన్ను ఉండమంటావా? లేక వెళ్ళమంటావా?"

"ఉన్నవాళ్లనే పోషించలేకపోతున్నాను.నువ్వైనా సుఖంగా ఉన్నావనుకున్నాను. ఇలాంటి పని చేస్తావనుకోలేదు."

"ఆ మాటలన్నీ అనవసరం! నన్ను ఉండమంటావా? వెళ్ళమంటావా?"

"నువ్వు ఇక్కడ ఎలా ఉంటావ్? నువ్వు జడ్జీగారి అమ్మాయి."

"నేను నువ్వు కన్న కూతుర్ని!"

"కాదు. కాదు....వెళ్ళు. నీ ముఖం నాకు చూపించకు, పో!" గట్టిగా పిచ్చిపట్టినట్టు అరిచింది వసుధ.

శకుంతల తెల్లబోయి నిల్చుంది.

"నీకూ ఈ ఇంటికీ ఎలాంటి సంబంధం లేదు. వెళ్ళు. మళ్లీ రాకు."

పిల్లలంతా బిక్కమొహాలు వేసుకొని నిల్చున్నారు.

సహజ ఏదో అనబోయి తల్లి ముఖంచూసి భయపడింది.

"నువ్వు మరో క్షణం ఇక్కడ ఉంటే నా శవాన్ని చూస్తావ్!"

"అమ్మా!"

"ఎవరే నీకు అమ్మ?" "ఆ రమాదేవిగారే నీకు అమ్మ. నేను కాదు. వెళ్ళు".

శకుంతల గిర్రున వెనక్కు తిరిగింది.

వాకిట్లో రాజారావుగారూ, రమాదేవి నిల్చునిఉన్నారు. రమ ముఖం పీక్కుపోయి జబ్బుపడిన మనిషిలా ఉన్నది.

జుట్టు రేగి ఉంది. చీర నలిగి ఉన్నది. రమ అలా బయటికి రావడం శకుంతల ఎప్పుడూ చూడలేదు.

"మమ్మీ !"

రమ చాచిన చేతుల్లో వాలిపోయింది శకుంతల.

రమ గట్టిగా బిడ్డను గుండెలకు హత్తుకొని వెక్కి-వెక్కి ఏడవసాగింది.

రాజారావు కళ్లు తుడుచుకున్నాడు.

వసుధ తల వంచుకొని అపరాధిలా నిల్చున్నది.

"అమ్మా ! వసుధా ?" ఏదో అనబోయి ఆగిపోయాడు రాజారావు.

"లోపలకు రండి" బొంగురు కంఠంతో ఆహ్వానించింది వసుధ.

కూతుర్ని పట్టుకుని లోపలకు నడవబోతున్న రమను "మమ్మీ ! వద్దు ! ఆ ఇంట్లో మనం అడుగుపెట్టవద్దు," గట్టిగా అరిచింది.

"శకూ ! నువ్వు ఆమెను అర్థంచేసుకోలేదు తల్లీ. ఒక వ్యక్తి మొయ్యలేని బరువును తలకు ఎత్తుకొని ఎన్నో మైళ్లు నడిచాడు. మెడ నరాలు పీకుతున్నాయ్. అడుగు ముందుకు పడటం లేదు. ఎవరైనా వచ్చి ఆ బరువులో కొంతభాగం అందుకుంటే బాగుండునని ఆశిస్తాడు. అప్పుడే ఎవరో వచ్చి మరికొంత బరువును నెత్తి మీద వెయ్యడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు ఆ వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడు ?" అన్నాడు రాజారావు.

"నేను ఆ బరువులో కొంత భాగాన్ని మొయ్యాలనే వచ్చాను."

"నువ్వు ఎంత అపురూపంగా పెరుగుతున్నావో ఆమె కళ్లారా చూసింది. తన బిడ్డ కష్టపడాలని ఏ తల్లీ కోరుకోదు. ఆమెను అర్థంచేసుకో !" అన్నాడు రాజారావు.

"అక్కా ! లోపలకు రండి ! నన్ను క్షమించండి." అన్నది వసుధ రమను ఉద్దేశించి.

"నువ్వు తప్పు చెయ్యలేదమ్మా ! న్యాయంగా ప్రవర్తించావ్. మా బిడ్డను మాకు అప్పగించిన మాతృమూర్తివి." అన్నది రమ.

శకుంతల తల వంచుకొని కూర్చుంది.

"తల్లీ నా మీద కోపమా ?" తల నిమురుతూ అడిగింది వసుధ.

"లేదు," అన్నట్టు శకుంతల తల ఆడించింది.

కాఫీలు తీసుకున్నారు.


*Deepavali Greetings*
*to our*
*Valued Clients & Well Wishers*

**GOLDEN PRESS**

**Gowliguda, Hyderabad. Phone: 44338**

*Specialists in*
Carton Printing, Box Making, Varnishing and
Quality Letter Press & Offset Printers,

"వెళ్ళొస్తాం చెల్లీ! అప్పుడప్పుడు వస్తూ ఉండు. మేమూ వస్తాం!" అన్నది రమ.

"ఆగండి!" అన్నాడు రాజారావు.

"నేను న్యాయమూర్తిని. నా న్యాయనిర్ణయాన్ని వినిపిస్తున్నాను."

అందరూ అతనికేసి కుతూహలంగా చూశారు.

"ఈ రోజునుంచి ఈ పిల్లల చదువులకూ బట్టలూ వగైరాకు అయే ఖర్చు మేము.... కాదు శకుంతల భరిస్తుంది."

"డాడీ! నువ్వెంత మంచివాడివి?" శకుంతల తండ్రి మెడచుట్టూ చేతులు వేసి నొసటిమీద ముద్దుపెట్టుకుంది.

"దట్ ఈజ్ ఆల్ రైట్!"

"వద్దు బాబుగారూ! నా భుజాల మీద అంత కృతజ్ఞతా భారాన్ని వెయ్యకండి." అన్నది వసుధ.

"అమ్మా! మా డాడీ తీర్పు చెప్పేశారు. నువ్వు కాదనడానికి వీల్లేదు. అలా అంటే నేను మళ్లీ నీ దగ్గరకే వచ్చి ఉంటాను. ఈ సారి నువ్వు కొట్టినా తిటినా వెళ్ళను తెలుసా!"

"మొండిపిల్ల!" వసుధ తల నిమురుతూ అన్నది.

"వాళ్ళ డాడీ యే దాన్ని అలా తయారుచేశారు." అన్నది రమ.

శకుంతల కార్లో కూర్చుంది.

వాకిట్లో నిలబడ్డ తమ్ముళ్లకూ, చెల్లెళ్లకూ, తల్లికీ కన్పించినంత వరకు టాటా చెప్తూనే ఉన్నది.

వసుధ కళ్ళు తుడుచుకుంటూ లోపలకు వచ్చింది.


# యువ

పాఠకులకు, ప్రకటనదారులకు, ఏజంట్లకు, శ్రేయోభిలాషులకు

## దీపావళి శుభాకాంక్షలు


Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road, Hyderabad, for Yuva Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor: A. SUDHAKARA RAO